
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

కృష్ణా జిల్లా వార్తలు

ఆదివారం 27 జూలై 2025





చల్లపల్లి కోట

ఆహా.. రాజసం!

ఉమ్మడి కృష్ణాజిల్లాలో సంస్థానాలు

- పాలకులుగా, ప్రజాప్రతినిధులుగా రాణించిన చల్లపల్లి, ముక్త్యాల, మైలవరం రాజులు
- నేటి పర్యాటక ప్రాంతాలుగా వర్ధిల్లుతున్న నాటి కోటలు



గడియారపు గంట

జమీందారీ సంస్థానాలకు ఉమ్మడి కృష్ణాజిల్లాలో ప్రత్యేక గుర్తింపు ఉంది. రాజులుగా పాలన సాగించిన చల్లపల్లి రాజా, ముక్త్యాల రాజా, మైలవరం రాజా, వారి వారసులు తదనంతర కాలంలో ప్రజాప్రతినిధులుగా ప్రత్యక్ష ఎన్నికల్లో విజయం సాధించారు. ప్రజల అభివృద్ధికి, సంక్షేమానికి విశేష సేవలు అందించారు. నాటి పాలనా సంస్థానాలుగా వర్ధిల్లిన కోటలు నేడు ప్రముఖ పర్యాటక ప్రాంతాలుగా పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ఒకప్పటి రాచరికపు రాజసానికి ఆనవాళ్లుగా దర్శనమిస్తున్నాయి. 8

పచ్చందాలు

వర్షాలతో కళకళలాడుతున్న లంకల్లోని తోటలు



తోట్లవల్లూరు లంకలో అరటిలో అంతర పంటగా కంద సాగు

తోట్లవల్లూరు లంకల్లోని పంట పొలాలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. వర్షాలకు అరటి, పసుపు, కంద, అరటిలో అంతర పంటలు, చెరకు, తమల పాకు, కూరగాయల తోటలు ఏపుగా పెరిగాయి. ఎనిమిది లంకల్లో సుమారు తొమ్మిది వేల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. వర్షాలు కురవటం, ఎరువుల వేయటంతో పచ్చదనంతో కనువిందు చేస్తున్నాయి. -(ఆంధ్రజ్యోతి-తోట్లవల్లూరు)



పసుపు



చేమదుంప



అరటి



కంద

పైసలిస్తేనే పని..!

మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయంలో అవినీతి దందా!

- ఓ రైతు ల్యాండ్ కన్వర్షన్ ఫైల్‌కు రూ.42 వేలు డిమాండ్
- ఏసీబీ అధికారులకు చిక్కిన సీనియర్ అసిస్టెంట్
- ఈ వ్యవహారంలో మరింత మంది హస్తం ఉన్నట్టు అనుమానం!
- కలెక్టరేట్‌లో చర్చనీయాంశంగా ఏసీబీ దాడి వ్యవహారం

మచిలీపట్నం రెవెన్యూ డివిజనల్ కార్యాలయం అవినీతికి అడ్డాగా మారింది. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర పనులకు ఉపయోగించుకునేందుకు ల్యాండ్ కన్వర్షన్ దరఖాస్తు వస్తే సబ్ ట్రెజరీ కార్యా లయంలో ఎంత నగదును చలానాగా చెల్లించారో అంతే మొత్తంలో నగదును ఇవ్వాలనే షరతులు పెట్టి.. దరఖాస్తుదారుల నుంచి ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. ఓ రైతు నుంచి రూ.42 వేలు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు శుక్రవారం సీనియర్ అసిస్టెంట్ పట్టుబడటమే ఇందుకు నిదర్శనం. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, కన్నబిడ్డల ఆదరణకు నోచుకోక ఇంటి నుంచి గెంటివేతకు గురైన వృద్ధులు జీవనోపాధి కోసం దరఖాస్తులు చేసుకుంటే ప్రతి పనికి ఒకరేటు నిర్ణయించి నగదు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

\- ఆంధ్రజ్యోతి- మచిలీపట్నం

నగదు ఇస్తామంటేనే ఫైలుపై సంతకం

మచిలీపట్నానికి చెందిన కొల్లిపర వెంకట లక్ష్మీనారాయణ అనే రైతు తనకు మచిలీపట్నం మండలం అరిసేపల్లిలో భూమి ఉందని, ల్యాండ్ కన్వర్షన్ చేయాలని దరఖాస్తు చేసుకు న్నారు. మచిలీపట్నం నార్త్ మండల తహసీల్దార్ కార్యాల యం నుంచి వచ్చిన ఫైలును వివిధ కారణాలు చూపి పరి ష్కరించకుండా తొక్కిపెట్టారు. సబ్ ట్రెజరీ కార్యాలయంలో రూ.42 వేలు చలానాగా చెల్లించారు కాబట్టి.. అంతే మొత్తంలో మిగతా 6లో..



మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయం

ఉలిక్కిపడ్డ కలెక్టరేట్ అధికారులు

కలెక్టర్ కార్యాలయ ఆవరణలో కలెక్టర్ చాంబర్‌కు 100 మీటర్ల దూరంలోనే ఆర్డీవో కార్యాలయం ఉంది. ఆర్డీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ తాను పనిచేసే కార్యాలయంలోనే రూ.40 వేలు లంచం తీసుకుంటూ శుక్రవారం రాత్రి ఏసీబీ అధికారులకు చిక్కాడు. కలెక్టరేట్‌లో ఉన్న ఆర్డీవో కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడి చేయడంతో కలెక్టరేట్‌లోని అధికారులు, ఉద్యోగులు ఉలిక్కిపడ్డారు. ప్రొటోకాల్ ఖర్చుల కోసం నగదు తీసుకున్నానని ఏసీబీ అధికారులకు చిక్కిన సీనియర్ అసిస్టెంట్ బీరం త్రినాథ్ చెప్పాడని, ఎవరి ప్రొటోకాల్ కోసం నగదును ఖర్చుచేస్తున్నాడోనని కలెక్టరేట్‌లో పనిచేసే అధికారులు చెప్పుకుంటున్నారు. ప్రొటోకాల్ ఖర్చులన్నీ పాత పద్ధతిలోనే మచిలీపట్నం తహసీల్దార్ కార్యాలయాలకు బదలాయిస్తారని, పై అధికారి సూచనలతోనే ప్రతిపనికి ఒక రేటు నిర్ణయించి ఆర్డీవో కార్యాలయాన్ని వ్యాపారమయంగా మార్చివేశారని రెవెన్యూ అధికారులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనతోనైనా రెవెన్యూ అధికారుల తీరును మార్చేందుకు జిల్లాస్థాయి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

అధికారులతో మాట్లాడుతున్న దుర్గగుడి ఈవో శీనానాయక్



దసరా ఉత్సవాలకు సిద్ధంకండి

ఆలయ ఉద్యోగులకు ఈవో శీనానాయక్ ఆదేశాలు

ఇంద్రకీలాద్రి, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వర దేవస్థానంలో సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జరగనున్న దసరా ఉత్సవాలకు ఆలయ ఉద్యోగులంతా సిద్ధంగా ఉండాలని ఈవో శీనానాయక్ ఆదేశించారు. దసరా ఉత్సవాలపై ఈనెల 29న జరిగే మొదటి సమన్వయ సమావేశాన్ని పురస్కరించుకుని శనివారం ఈవో చాంబర్‌లో వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ గత ఏడాది జరిగిన దసరా ఉత్సవాల ఏర్పాట్లు, భక్తులు వసతులు, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది ఉత్సవాలను అన్ని ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల సమన్వయంతో ఎటువంటి ఇబ్బందులు, అసౌకర్యం కలగకుండా విజయవంతం చేద్దామని సూచించారు. ఈ సమావేశంలో ఇంజనీరింగ్ అధికారులు, ఏఈవోలు, అర్చకస్వాములు పాల్గొన్నారు.



ఘటనాస్థలంలో తీవ్ర గాయాలతో యువకులు

ప్రాణాలు తీసిన అతివేగం

- ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు యువకుల మృతి
- బంటుమిల్లి మండలం పెందుర్రు గ్రామం వద్ద ఘటన

బంటుమిల్లి, జూలై 26(ఆంధ్రజ్యోతి): వేగంగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందగా, ఓ యువకుడు తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఘటన బంటుమిల్లి మండలం పెందుర్రు గ్రామం వద్ద 216 జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కృత్తివెన్ను మండలం అడ్డపర్రు గ్రామానికి చెందిన నైంద్రు నరేష్(25) బంటుమిల్లి నుంచి ఇంటికి వెళ్తున్నాడు. ఏలూరు జిల్లా పెదపాడు మండలం ఏపూరు గ్రామానికి చెందిన చెరుకుమిల్లి శివకుమార్ (25), గుర్రం పవన్‌కుమార్ యానం నుంచి హనుమాన్ జంక్షన్ బయలు మిగతా 6లో..

జనజీవన స్రవంతిలోకి..

విద్యార్థి దశలో మావోయిజం వారి మనస్సుల్లోకి ప్రవేశించింది. ఒకే జిల్లా నుంచి వేర్వేరుగా అరణ్యంలోకి అడుగుపెట్టినా యాదృచ్ఛికంగా కలిశారు. పెద్దల సమక్షంలో వివాహ బంధంతో ఒక్కటయ్యారు. అగ్రనేతలకు అనుచరులుగా ఉంటూ దళంలో అంచెలంచెలుగా ఎదిగారు. ఆపరేషన్ కగార్‌తో కంగారు పడిన ఆ దంపతులు పోలీసులకు లొంగిపోయారు. కృష్ణాజిల్లా పెనమలూరు మండలం పోరంకి గ్రామానికి చెందిన జోరిగె నాగరాజు, గూడూరు మండలం కప్పలదొడ్డి గ్రామానికి చెందిన జ్యోతీశ్వరి జీవిత నేపథ్యం ఇది. ఇద్దరూ కృష్ణాజిల్లాకు చెందిన వారే అయినా ఇప్పుడు ఆయా గ్రామాల్లో వారికి సంబంధించిన బంధువులు ఎవరూ లేరు.

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : జోరిగె నాగరాజు 1971లో జన్మించారు. పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్నారు. తర్వాత గొల్లపూడిలో ఐటీఐలో చేరారు. ఐటీఐలో సివిల్ చేస్తుండగా మావోయిస్టు భావజాలానికి ఆకర్షితుడయ్యారు. 1991లో రాడికల్ స్టూడెంట్స్ యూనియన్‌లో చేరారు. ఐటీఐ తర్వాత నాగరాజు అడుగులన్నీ అడవుల వైపు పడ్డాయి. 1993లో మావోయిస్టు పార్టీలో సభ్యుడిగా చేరిన ఆయన మిగతా 6లో..

‘కృష్ణా’లో పెరిగారు.. దండకారణ్యంలో ఎదిగారు!

- డీజీపీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టు దంపతులు
- అబూజ్‌మడ్ ఎన్‌కౌంటర్‌లో త్రుటిలో తప్పించుకున్న నాగరాజు, జ్యోతీశ్వరి
- ఇద్దరూ కృష్ణాజిల్లా వాసులే..



డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా నుంచి చెక్కులు అందుకుంటున్న నాగరాజు, జ్యోతీశ్వరి దంపతులు

ఇదీ జ్యోతీశ్వరి నేపథ్యం..

నాగరాజు సతీమణి పేరు మేడక జ్యోతీశ్వరి. కృష్ణాజిల్లా గూడూరు మండలం కప్పలదొడ్డికి చెందిన ఆమె చేనేత కుటుంబంలో జన్మించారు. ఆమెకు ఇద్దరు అక్కలు, అన్నయ్య ఉన్నారు. ఈమె పదో తరగతి వరకు పెడనలోని జిల్లాపరిషత్ పాఠశాలలో చదువుకున్నారు. 1997లో జ్యోతీశ్వరి ఇంటి నుంచి వెళ్లిపోయారు. తర్వాత మావోయిస్టు దళంలో చేరారు. అగ్ర నేతలు జ్యోతీశ్వరికి నాగరాజుతో వివాహం చేశారు. ఒకరికొకరు సంబంధం లేకుండా దళంలోకి వెళ్లి అక్కడే ఒక్కటయ్యారు. ఈమె దళంలోకి వెళ్లే సరికే నాగరాజుకు హరగోపాల్ అనుచరుడిగా ముద్రపడింది. నాగరాజు గుంటూరు డివిజనల్ కమిటీలో ఉన్నప్పుడు జ్యోతీశ్వరి దాచేపల్లి, బెల్లంకొండ దళాల్లో పనిచేశారు. నాగరాజును వివాహం చేసుకున్న తర్వాత కృష్ణపట్టి ఏరియా కమిటీ, రాచకొండ దళంలో పనిచేశారు. 2001లో ఏరియా కమిటీ సభ్యురాలిగా జ్యోతీశ్వరి పదోన్నతి పొందారు. నల్లగొండ డివిజనల్ కమిటీ పరిధిలో ఉన్న రాచకొండ, కృష్ణపట్టి దళాల్లో ఆమె పనిచేశారు. 2006లో డివిజనల్ కమిటీ సభ్యురాలిగా పదోన్నతి పొంది 2007లో బస్తర్ ప్రాంతానికి బదిలీ అయ్యారు. 2008లో తూర్పు బస్తర్ డివిజనల్ కమిటీ మహిళా విభాగం ఇన్‌చార్జి బాధ్యతలను చేపట్టారు. తర్వాత 2011లో కేశకల్ ఏరియా కమిటీ కార్యదర్శిగా పార్టీ ఆమెను నియమించింది. 2014లో ఉవే, కిస్కోడ్ సబ్ డివిజనల్ కమిటీకి ఇన్‌చార్జిగా వ్యవహరించారు. దళంలో సభ్యులకు రాజకీయ అంశాలపై అవగాహన కల్పించే మొబైల్ అకడమిక్ పొలిటికల్ ఆర్గనైజేషన్ స్కూల్ (ఎంఏపీఓఎస్) పాఠాలను బోధించారు. జ్యోతీశ్వరిపై ప్రభుత్వం రూ.5లక్షల రివార్డును ప్రకటించింది. దళంలో జ్యోతీశ్వరికి అరుణ, సరిత, మాలతి, తరుణ అనే పేర్లు ఉన్నాయి.

ఉపాధిలో ఉద్యాన పంటల సాగు

- పూర్తి రాయితీతో ఆర్థిక సాయం
- మూడేళ్ల వరకు రైతుకు భరోసా
- ఐదు వేల ఎకరాల్లో పూలు, పండ్ల మొక్కల సాగు

6

తపాలాశాఖకు స్థల వితరణ 8

మారుతున్న చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- హైకోర్టు న్యాయమూర్తి హరిహరనాథ శర్మ 6

స్థానిక ఎన్నికలకు నేతలు సిద్ధం కావాలి

- మంత్రి కొల్లు రవీంద్ర 8

పట్టాభి భవనం నిర్మించి తీరుతాం

- ఎంపీ వల్లభనేని బాలశౌరి 8

6 ఉచిత బస్సు పథకానికి బస్సులు సిద్ధం చేస్తున్నాం



గ్రాడ్యుయేషన్ డేలో విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న హైకోర్టు న్యాయమూర్తి అవధానం హరిహరనాథ శర్మ

మారుతున్న చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

● హైకోర్టు న్యాయమూర్తి అవధానం హరిహరనాథ శర్మ

కానూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : కాలానుగుణంగా మారుతున్న చట్టాలపై న్యాయవాదులు అవగాహన పెంచుకోవాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి అవధానం హరిహర నాథ శర్మ అన్నారు. కానూరులోని సిద్ధార్థ న్యాయ కళాశాల గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బీఏఎల్ఎల్బీ 2020-2025, ఎల్ఎల్బీ 2022-2025 విద్యార్థులకు న్యాయ విద్య పట్టాలు ఆయన అందజేశారు. న్యాయవృత్తిలో న్యాయవాదులు పూర్తి అంకితభావం కలిగి ఉండాలన్నారు. ప్రస్తుత ప్రపంచంలో న్యాయ విద్య అత్యున్నత అవకాశాన్ని కలిగి ఉందన్నారు. నైపుణ్యాలు నేర్చుకోవలసిన సమయంలో సమయం వృధా చేసుకోరాదన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ దివాకర్‌బాబు మాట్లాడుతూ న్యాయవాద వృత్తి ఎంతో బాధ్యతాయుతమైన వృత్తి అన్నారు. ఈ వృత్తిని సమాజ శ్రేయస్సు కోసం ఉపయోగించే విధంగా ఉండాలని కోరారు. కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌పై విచారణకు మూడు కమిటీలు

● అధిక ఫీజుల వసూలు, విద్యార్థులను దూషించారనే ఆరోపణలు

విజయవాడ, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరమ్మపై శాఖాపరమైన విచారణకు సంబంధిత శాఖ అధికారులు మూడు కమిటీలు నియమించారు. విద్యార్థుల నుంచి పరీక్ష ఫీజు అధికంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో అడిషనల్ డీఎంఈ డాక్టర్ వెంకటేష్‌తో పాటు మరో రెండు కమిటీలు నియమించారు. ఇందులో ఒక కమిటీ ఇప్పటికే సగం విచారణ పూర్తి చేసి, మెస్ బిల్లులో అవకతవకలు జరిగినట్టు గుర్తించింది. ఈ విచారణకు సంబంధించి ఒక్కో కమిటీ వద్ద సుమారు 15 పేజీల ఆరోపణలతో రిపోర్టు ఉందని, మూడు కమిటీల వద్ద సుమారు 50 పేజీలకు పైగా నివేదిక ఉన్నట్టు సమాచారం. నర్సింగ్ విద్యార్థినులను ఇష్టారీతిన దూషించడమే కాకుండా, తన వ్యక్తిగత పనులు కూడా వారితో చేయిస్తున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ కమిటీలు విచారణ చేస్తున్నాయి.




జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రభుత్వ ఆర్థిక సాయంతో సాగు చేస్తున్న తైవాన్ జామ, డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు

ఉపాధిలో ఉద్యాన పంటల సాగు

● పూర్తి రాయితీతో ఆర్థిక సాయం ● మూడేళ్ల వరకు రైతుకు భరోసా ● ఐదు వేల ఎకరాల్లో పూలు, పండ్ల మొక్కల సాగు

ఉద్యాన పంటల సాగు రైతులకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ ఈజీఎస్) ఆర్థికంగా చేయూతనందిస్తోంది. ఈ పథకం కింద ఎంపిక చేసిన 19 రకాల పూలు, పండ్లు, కూరగాయల మొక్కలను సాగుచేసే రైతులకు భరోసా కల్పిస్తోంది. మొక్క నాటిన రోజు నుంచి విడతల వారీగా మూడేళ్ల వరకు ఈ పథకం ద్వారా రైతులు లబ్ధి పొందవచ్చు. జాబ్‌కార్డు కలిగి సొంత భూమి ఉన్న రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నీటి నిర్వహణ సంస్థ (డ్వామా) అధికారులు కోరుతున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ)

ఈ పథకం కింద ఒక్కో పంట సాగుకు ఒక్కో రకంగా ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందిస్తుంది. ఎకరం విస్తీర్ణంలో 70 మామిడి మొక్కలు నాటి సాగు చేస్తే మూడేళ్లలో రూ.1.09 లక్షలు లబ్ధి చేకూరుతుంది. ఎకరం విస్తీర్ణంలో 70 జీడి మొక్కల సాగుకు రూ.98,684, బత్తాయి 100 మొక్కలకు రూ. 1.37 లక్షలు, 110 మొక్కల నిమ్మ సాగుకు రూ.1.46 లక్షలు, 110 జామ మొక్కలకు రూ .1.46 లక్షలు, 444 తైవాన్ జామ మొక్కల సాగుకు రూ.2.51 లక్షలు, 60 సపోట మొక్కల సాగుకు రూ.95,584, కొబ్బరి 60 మొక్కలకు రూ.99,183, నేరేడు 40 మొక్కలకు రూ.68,163, సీతాఫలం 240 మొక్కలకు రూ.2.14 లక్షలు, 267 దానిమ్మ మొక్కలకు 2.16 లక్షలు, 60 పామాయిల్ మొక్కలకు రూ.55,770లను ప్రభుత్వం అందజేస్తుంది. అదేవిధంగా రెండేళ్ల వరకు లబ్ధి చేకూరే 320 ఆపిల్ బేర్ మొక్కలకు రూ.1.26 లక్షలు, 225 మొక్కల డ్రాగన్ ఫ్రూట్ సాగుకు రూ.2 లక్షలు అందిస్తుంది. శాశ్వత పద్ధతిలో గులాబీ 500 మొక్కల సాగుకు రూ.62,355, మల్లె పూల సాగుకు రూ. 55,124, మునగ 112 మొక్కల సాగుకు రూ.27,515, గట్ల వెంబడి ఇతర పంటలు 112 మొక్కలు నాటితే రూ.26,448 అందజేస్తుంది. అర ఎకరంలో పశుగ్రాసం పెంపకానికి రూ .32,992 (ఏడాదికి) మంజూరు అవుతుంది.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ఉద్యాన రైతులకు ఆర్థికంగా చేయూతను అందించి పండ్ల, పూల ఉత్పత్తులను పెంచి, తద్వారా సామాన్య, మధ్య తరగతి ప్రజలకు పండ్లు, పూలు అందుబాటు ధరల్లో అందించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ ఏడాది ఐదు వేల ఎకరాల్లో మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. లక్ష్యానికి మించి రైతులు వచ్చినా ఈ పథకం లబ్ధిని అందిస్తాం. మొక్కలు నాటిన రోజు నుంచి పూత, పిందె, మొదటి పంట కోతకు వచ్చే వరకు ఈ పథకంలో రైతుకు ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలుస్తుంది. ఈ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. రైతులు ఈ పథకం వివరాల కోసం ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంటును సంప్రదించాలన్నారు.

- ఆరేపల్లి రాము, ప్రాజెక్ట్ డైరెక్టర్, డ్వామా, ఎన్టీఆర్ జిల్లా

ఐదు వేల ఎకరాల్లో మొక్కల సాగు లక్ష్యం

2025-26 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఐదు వేల ఎకరాల్లో మొక్కలు నాటాలని డ్వామా అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. వీటిల్లో ఇప్పటికే 3,839 ఎకరాలను గుర్తించారు. 2,733 ఎకరాలకు అంచనాలు సిద్ధం చేసి 1,826 ఎకరాలకు అనుమతులు మంజూరు చేశారు. 891 ఎకరాల్లో మొక్కలు నాటడం పూర్తి చేశారు. విస్సన్నపేట క్లస్టర్‌లోని ఏ.కొండూరు, గంపలగూడెం, రెడ్డిగూడెం, తిరువూరు, విస్సన్నపేట మండలాల్లో 2,125 ఎకరాల్లో, నందిగామ క్లస్టర్‌లోని చందర్లపాడు, జగ్గయ్యపేట, నందిగామ, పెనుగంచిప్రోలు, వత్సవాయి, వీరుల్లపాడు మండలాల్లో 1,500 ఎకరాల్లో, విజయవాడ క్లస్టర్‌లోని జి.కొండూరు, ఇబ్రహీంపట్నం, కంచికచర్ల, మైలవరం, విజయవాడ రూరల్ మండలాల్లో 1,375 ఎకరాల్లో మొక్కలు నాటాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.



కప్పలదొడ్డిలోని జ్యోతీశ్వరి తండ్రి ఇల్లు

జనజీవన స్రవంతిలోకి..

(5వ పేజీ తరువాయి)

అగ్రనేత అక్కిరాజు హరగోపాల్‌కు అనుచరుడిగా మారారు. ఆయనకు సహాయకుడిగా, కొరియర్‌గా వ్యవహరించేవారు. హరగోపాల్ సెంట్రల్ కమిటీ సభ్యుడిగా ఉన్నప్పుడు ఆయన శిష్యుడిగా ముద్రవేయించుకున్నారు. తర్వాత రీజనల్ కమిటీ సెక్రటరీగా పనిచేసిన మస్తాన్‌రావు నేతృత్వంలో పనిచేశారు. ఈ ఇద్దరి వద్ద పనిచేసిన అనుభవంతో 1998లో దళంలో ఏరియా కమిటీ సభ్యుడిగా ఎదిగారు. గుంటూరు డివిజనల్ కమిటీ పరిధిలో ఉండే దాచేపల్లి, బొల్లపల్లి దళాల్లో పనిచేశారు. 2002లో నాగరాజు డివిజనల్ కమిటీ సభ్యుడిగా పదోన్నతి పొంది గుత్తికొండ ఏరియా కమిటీ, గుంటూరు డివిజనల్ కమిటీకి ఇన్‌చార్జిగా వ్యవహరించారు. 2005లో కృష్ణపట్టి దళం డివిజనల్ కమిటీ కార్యదర్శిగా బదిలీ అయ్యారు. 1997లో మావోయిస్టు పార్టీ అప్పటికే దళంలో చేరిన జ్యోతీశ్వరితో నాగరాజుకు వివాహం చేసింది. అప్పటికి జ్యోతీశ్వరి గుంటూరు డివిజనల్ కమిటీ పరిధిలోని చంద్రవంక దళ సభ్యురాలిగా పనిచేస్తుంది. 2006లో మావోయిస్టు పార్టీ నాగరాజును దండకారణ్యానికి బదిలీ చేసింది. 2014 వరకు తూర్పు బస్తర్ డివిజనల్ కమిటీ కార్యదర్శిగా పనిచేశారు. తర్వాత సౌత్ జోనల్ కమిటీ సభ్యుడిగా పదోన్నతిపై ఉత్తర బస్తర్‌కు బదిలీ అయ్యారు. 2014 నుంచి 2019 వరకు ఉత్తర బస్తర్ డివిజనల్ కమిటీకి ఇన్‌చార్జిగా పనిచేశారు. ఆ తర్వాత నాగరాజుకు పార్టీ తిరిగి ఉత్తర బస్తర్ డివిజనల్ కమిటీ బాధ్యతలు అప్పగించింది. 2019 నుంచి ఇప్పటి వరకు తూర్పు బస్తర్ డివిజనల్ కమిటీకి ఇన్‌చార్జిగా వ్యవహరించారు. మావోయిస్టు పార్టీలోకి వెళ్లిన తర్వాత నాగరాజు పేరు ఒక్కో డివిజన్‌లో ఒక్కో విధంగా మారింది. ఆర్కే, విష్ణు, కమలేష్ పేర్లతో నాగరాజు దళంలో నాయకుడిగా ఎదిగారు. నాగరాజుపై ప్రభుత్వం రూ.20లక్షల రివార్డును ప్రకటించింది.

అబూజ్‌మడ్ భారీ ఎన్‌కౌంటర్‌లో చనిపోయారని ప్రచారం

గడచిన ఏడాది అక్టోబరు నెలలో అబూజ్‌మడ్‌లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. మావోయిస్టు పార్టీకి అగ్రనేతలుగా ఉన్న వాళ్లను ఆపరేషన్ కగార్‌లో భాగంగా భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో నాగరాజు, అరుణ చనిపోయినట్టు వార్తలు వచ్చాయి. వారిద్దరూ చనిపోయినట్టు పలు చానళ్లు ప్రసారం చేశాయి. కానీ అబూజ్‌మడ్ ఎన్‌కౌంటర్‌లో నాగరాజును కాపాడే క్రమంలోనే 31 మంది దళం సభ్యులు ప్రాణాలు కోల్పోయినట్టు నిఘా వర్గాలు తెలిపాయి.

భద్రతా బలగాలు కాల్పులు జరుపుతుండగా అతడికి తూటాలు తగలకుండా ఈ దళ సభ్యులు అడ్డుగా నిలబడటంతో వారు చనిపోయారు. అక్కడి నుంచి నాగరాజు దండకారణ్యంలోకి పారిపోయాడు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతానికి సమీపంలోనే అతడి భార్య అరుణ ఉంది. ఇద్దరూ కలిసి త్రుటిలో తప్పించుకుని దండకారణ్యంలో తలదాచుకున్నారు. ఆపరేషన్ కగార్ నేపథ్యంలో ఈ ఇద్దరు జనజీవన స్రవంతిలో వచ్చారు.



హైకోర్టు ఉత్తర్వులను ఎంపీ బాలశౌరికి చూపిస్తున్న పట్టాభి భవన సాధన కమిటీ సభ్యులు పి.వి.ఫణికుమార్, మాదివాడ రాము, వేము కోటేశ్వరరావు

పట్టాభి భవనం నిర్మించి తీరుతాం

మచిలీపట్నం టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా పట్టాభి స్మారక భవనాన్ని నిర్మించి తీరుతామని ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. క్యాంపు కార్యాలయంలో ఎంపీ బాలశౌరికి పలువురు సమస్యలపై వినతి పత్రాలు సమర్పించారు. పట్టాభి మెమోరియల్ భవన సాధన కమిటీ సభ్యులు పి.వి.ఫణికుమార్, మాదివాడ రాము, వేము కోటేశ్వరరావు తదితరులు ఎంపీ బాలశౌరిని కలిసి పట్టాభి స్మారక భవనానికి నగర పాలక సంస్థ ఎన్వోసీ ఇవ్వకపోవడాన్ని వివరించారు. బాలశౌరి మాట్లాడుతూ, మచిలీపట్నానికి పేరు ప్రఖ్యాతులు తెచ్చిన ఆంధ్రా బ్యాంకు వ్యవస్థాపకుడు పట్టాభి సీతారామయ్య జ్ఞాపకార్థం ప్రజలకుపయోగపడే విధంగా స్మారక భవనాన్ని నిర్మించి తీరుతామన్నారు. జిల్లా కోర్టు సెంటర్‌లోని అంబేడ్కర్ భవన్ పునర్మించాలని దళిత ఉద్యోగ సంఘాల నాయకులు మత్తే నాగరాజు, తదితరులు ఎంపీ బాలశౌరిని కోరారు. భవనాన్ని పునర్మిమించేందుకు నిధులు మంజూరు చేయించాలన్నారు. మచిలీపట్నం న్యాయవాదుల సంఘ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దివి పోతురాజు, న్యాయవాదులు తిరుమాని సత్యనారాయణ, పసుమర్తి సూర్యప్రకాశ్, ఎండి మస్తాన్ కోరారు. శిథిల స్థితికి చేరిన టీటీడీ కల్యాణ మండపాన్ని పునర్నిర్మించాలని, తిరుపతి రైలును పునరుద్ధరించాలని కోరుతూ బీజేపీ నాయకులు సోడిశెట్టి బాలాజీ , సూరిశెట్టి హరికృష్ణ, ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి తదితరులు బాలశౌరికి వినతి పత్రం సమర్పించారు. కౌతవరం నాయకులు పలువురు బాలశౌరి సమక్షంలో జనసేన పార్టీలో చేరారు.



జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీల విజేతలతో స్టేడియం కమిటీ సభ్యులు



చెస్‌పోటీల విజేతలతో స్టేడియం కమిటీ సభ్యులు

షటిల్ బ్యాడ్మింటన్, చెస్ విజేతలు వీరే

గుడివాడ, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ స్టేడియంలో స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కఠారి శ్రీనివాసరావు మెమోరియల్ జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు, గుడివాడ స్కూల్స్ స్థాయి చెస్ పోటీలు శుక్రవారం రాత్రి ఘనంగా ముగిశాయి. ఈ పోటీలకు 170 మంది క్రీడాకారులు హాజరయ్యారు.

షటిల్ బ్యాడ్మింటన్ విజేతల వివరాలు

అండర్-13 బాలుర విభాగంలో గౌతమ్ రెడ్డి, రోహన్ శ్రీజయ, ఎ.కృప సుమాన్య, అండర్-15 బాలుర విభాగంలో అఖిల్ సాయి, గౌతమ్‌రెడ్డి, ఎం.హాజీ మస్తాన్, అండర్-13 బాలుర డబుల్స్ విభాగంలో విక్రమ్ రిషిక్ చౌదరి, కె.వి.ఎస్ క్రితిన్ చౌదరి జంట, ఎ.కృప సుమాన్య, లోచన్ జంట, మైటీ, ప్రియాన్స్ జంట, అండర్-15 బాలుర డబుల్స్ విభాగంలో కె.వి.ఎస్ క్రితిన్ చౌదరి, అఖిల్ జంట, రోహన్ శ్రీజయ, లోహిత్ జంట, బెనర్జీ, ఆయుష్మాన్ జంట, బాలికల అండర్-13 విభాగంలో పూనమ్ రీతూ, ఎం.లాస్య, ఆర్.దీప్తి బాలికల అండర్-15 విభాగంలో బి.వర్షిత, ఆర్.ఎన్ రూపసింగ్, జె.హరిణి, అండర్ -15 డబుల్స్ విభాగంలో ఆర్ఎన్ రూపసింగ్, బి.వర్షిత జంట, వి.సాయి ఇషిత, జయశ్రీ జంట, దీప్తి, లాస్య జంట ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు.

చెస్ పోటీల విజేతల వివరాలు....

అండర్-9 విభాగంలో ఎం.దేవాన్స్ (కెకెఆర్స్ గౌతమ్), ఐ.వేదాంత్ (వికాస్ రెయిన్‌బో), ఎం.పూర్వాన్ష్ నాగసాయి (కెకెఆర్స్ గౌతమ్), అండర్-11 విభాగంలో ఎం.వెనోరి సామ్(ఫాదర్ బియాంకీ), పి.ఇషిత (విశ్వభారతి), ఆర్.వంశీకృష్ణ (హోలీక్రాస్), అండర్-13 విభాగంలో ఎం.తిరానంద్ (నారాయణ), వి.వీదా కార్తీక్(ఫాదర్ బియాంకి), ఎ.రెహమాన్ (త్రివేణి), అండర్-15 విభాగంలో పి.నందకిషోర్(ఎజికె), షేక్ సమీర్(మాంటిస్సోరి), బి.ప్రవల్లిక(ఏజీకే) విజేతలుగా నిలిచారు. అండర్-9 విభాగంలో జె.వెంకట సుజిత్(విద్యావికాస్), జె.పునీత్‌కుమార్(ఎస్పీఎస్), అండర్-11 విభాగంలో సి.హెచ్ శ్రవణ్ ఆదర్శ్ (కెకెఆర్స్ గౌతమ్), అండర్-13 విభాగంలో ఎం.లీనా షారోన్(ఫాదర్ బియాంకీ), పి.రవికాంత్(షైనింగ్ స్టార్స్) కన్సొలేషన్ బహుమతులను అందుకున్నారు. ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో విజేతలకు స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్ బహుమతులను అందజేశారు. కమిటీ సభ్యులు డి.రవికుమార్, డాక్టర్ జి.వెంకటరత్నం, జీవితకాల సభ్యులు పిన్నమనేని సాంబశివరావు, తిరుపతయ్య, స్టేడియం సిబ్బంది, కోచ్‌లు పాల్గొన్నారు.

పైసలిస్తేనే పని..!

(5వ పేజీ తరువాయి)

తమకు నగదు ఇవ్వాలని ఆర్డీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ బీరం త్రినాథ్ డిమాండ్ చేశారు. సదరు రైతు అంత మొత్తంలో ఇవ్వలేనని చెప్పడంతో ఈ ఫైల్‌ను తిరస్కరించారు.

ఫైల్‌కు సంబంధించిన కదలికలన్నీ తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల రికార్డులలో నమోదై ఉన్నాయి. అయితే నగదు ఇవ్వడానికి వస్తున్నామని రైతు చెప్పిన అర గంట వ్యవధిలోనే ఈ ఫైలుపై ఆర్డీవో సంతకం చేశారని, దీని వెనుక కారణాలు ఏమై ఉంటాయనే అంశంపైనా చర్చ జరుగుతోంది.

లంచం తీసుకునే కొద్దిసేపటి ముందే ఈ ఫైలుపై సంతకం ఆర్డీవోతో సీనియర్ అసిస్టెంట్ చేయించారని ఏసీబీ అధికారులే ధ్రువీకరించడం గమనార్హం.

మండలాల్లోని రెవెన్యూ ఉద్యోగులకు వేధింపులు

మచిలీపట్నం రెవెన్యూ డివిజన్ కార్యాలయం పరిధిలో 11 మండలాలు ఉన్నాయి. ల్యాండ్ కన్వర్షన్‌కు సంబంధించి ఫైళ్లు ఆర్డీవో కార్యాలయానికి వస్తే మండలాల్లోని రెవెన్యూ అధికారులకు ఫోన్ చేసి నగదు ఇవ్వాలని దరఖాస్తుదారులకు ఎందుకు చెప్పలేదని, వారిపై చిందులు తొక్కుతున్నారని సమాచారం.

ల్యాండ్ కన్వర్షన్ కోసం దరఖాస్తు చేసుకునే సమయానికి భూమిలో వివిధ నిర్మాణాలు ఉన్నాయని, భూమిని మెరక చేశారని, భూమికి సంబంధించిన పత్రాలు సక్రమంగా లేవని, రకరకాల కారణాలు చూపి, అనుమతులు ఇవ్వడానికి అవకాశం లేదని ఆర్డీవో కార్యాలయం సీనియర్ అసిస్టెంట్, ఇతర సిబ్బంది బెదిరింపు ధోరణితో మాట్లాడటం గమనార్హం.

పనులు త్వరగా అవుతాయనే కారణంతో ఎమ్మెల్యేలు లేదా ప్రజాప్రతినిధులు సిఫార్సు చేశారని, ఇబ్బంది పెట్టకుండా పనులు పూర్తి చేయాలని ఆయా తహసీల్దార్ కార్యాలయాల అధికారులు, సిబ్బంది చెబితే, ఆ సంగతి పక్కనపెట్టి మా సంగతి చూడాలని, మీరే సర్దిచెప్పి పంపాలని లేకుంటే ఫైళ్లు కదలవని ఆర్డీవో సీసీ, ఇతర సిబ్బంది చెబుతుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



దాసరి వెంకయ్య తోటపల్లి



వీరంకి వెంకటస్వామి మద్దూరు

తిరుమలలో తప్పిపోయిన కృష్ణాజిల్లా భక్తులు

● ఒకరిది తోటపల్లి

● మరొకరిది మద్దూరు

తిరుమల, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి వచ్చిన ఇద్దరు భక్తులు తిరుమలలో తప్పిపోయారు. ఈనెల 18న 35 మందితో కూడిన ఓ భక్తబృందం తిరుమలకు వచ్చింది. దర్శనానంతరం లడ్డూలు తీసుకునే సమయంలో ఆగిరిపల్లి మండలం తోటపల్లికి చెందిన దాసరి వెంకయ్య (74), కంకిపాడు మండలం మద్దూరుకు చెందిన వీరంకి వెంకటస్వామి (49) రద్దీలో తప్పిపోయారు. బంధుమిత్రులు తిరుమలలో గాలించినా కనిపించలేదు.

సొంత ఊళ్లకి వెళ్లిపోయి ఉంటారనుకుని అందరూ తిరుగు ప్రయాణం అయ్యారు. అయితే వీరు ఇళ్లకు చేరుకోకపోవడంతో తిరుమల వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంకయ్య, వెంకటస్వామి వివరాలు తెలిసిన వారు 94407 96769, 94407 96771 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని తిరుమల వన్‌టౌన్ పోలీసులు కోరారు.

అలరించిన తకిట తత్ ఝుం

విజయవాడ కల్చరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం (సిద్ధార్థ అకాడమీ సాంస్కృతిక సంస్థ) నెలవారీ కార్యక్రమంలో భాగంగా శనివారం విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో చెన్నైకి చెందిన కృపా సెంటర్ ఫర్ ఫైన్ ఆర్ట్స్ బృందం ప్రదర్శించిన తకిట తత్‌ఝుం భరతనాట్య ప్రదర్శన ఆద్యంతం అలరించింది. తోడయం (రంగాధిదేవత స్తుతి)తో తొలుత భరతనాట్య ప్రదర్శనను పాండురంగ సుందరేశన్ ఆరంభించారు. రెండో అంశంగా ఆదిశంకరుల విరచిత కాలభైరవాష్టకాన్ని డాక్టర్ గురు భరద్వాజ్ జతులు సమకూర్చగా, కాశీ మహాకాలభైరవుడికి నీరాజనంగా కళాకారిణులు ప్రదర్శించారు. మూడో అంశంగా తకిటతత్ ఝుం అనే ప్రధాన నృత్యాంశాన్ని హృద్యంగా ప్రదర్శించారు. ముందుగా పంచభూతాత్మక లయను ప్రకృతి లయం ఆవిష్కరించగా, మానవ శ్రమను నిత్య జీవనాలయం అనే నృత్యాంశం ప్రతిబింబించింది. జానపదుల జీవనకృత్యాన్ని లోక కళాలయ అంశంలో చూపారు. సంగీత, నృత్య బహిరపొరలను స్వారలయం అనే అంశం బహిర్గతం చేయగా, మానవ సంబంధాలు, వివాహ వ్యవస్థ, ప్రేమైక భావనలను బాంధవ లయం వెల్లడించింది. మానవ చిత్తవృత్తులను మనోలయం ఆవిష్కరించింది. మొత్తం ఆరు అంశాలుగా లయాన్విత ప్రకృతి, లయబద్ధ జీవితం కథాంశంగా తకిట తత్ ఝుం సాగింది. కృపా సెంటర్ ఫర్ ఫైన్ ఆర్ట్స్ (చెన్నై) పక్షాన భరతనాట్యాంశాన్ని రూపకల్పన చేసిన ప్రముఖ నాట్యాచారిణి సాయికృప ప్రసన్నను ఈ సందర్భంగా సిద్ధార్థ కళాపీఠం పక్షాన అకాడమీ కార్యదర్శి బి.వి.ఎస్ ప్రకాష్, కార్యవర్గ సభ్యులు తాతినేని శ్రీహరిరావు సత్కరించారు.



తకిట తత్ ఝుంలో కళాకారిణుల అభినయం

ప్రాణాలు తీసిన అతివేగం

(5వ పేజీ తరువాయి)



మృతుడు శివకుమార్

దేరారు. పెందుర్రు శివారు 216 జాతీయ రహదారిపై మిలేష్ కంపెనీ సమీపంలో ఎదురెదురుగా వస్తున్న ఈ రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఏపూరుకు చెందిన చెరుకుమిల్లి శివకుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. నైన్రదు నరేష్, గుర్రం పవన్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో మచిలీపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నైన్రదు నరేష్ మృతి చెందాడు. పవన్‌కుమార్ పరిస్థితి విషమంగా ఉంది. బంటుమిల్లి ఎస్సై గణేష్‌కుమార్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 475

ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై శిక్షణ



ఉయ్యూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మార్చేందుకు ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని గన్నవరం డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం. సునీల్ అన్నారు. గండిగుంట రైతు సహాయ కేంద్రంలో శనివారం ఉయ్యూరు, పెనమలూరు, పమి డిముక్కల మండలాలల గ్రామీణ వ్యవసాయ సహాయకులకు ఆంధ్రప్రదేశ్ కమ్యూ నిటీ మేనేజ్ నాచురల్ ఫార్మింగ్ సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి సేద్యపు వ్యవసాయ పద్ధతులపై శిక్షణా తరగతులు నిర్వహించారు. డీఆర్సీ ఏడీఏ శ్రీనివాస్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యాన్ని సాధించుకుందాం

పెదపులిపాకలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె



పెదపులిపాకలో సమస్యలు వింటున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో కనీస అవసరాలు అయిన మంచినీరు, రోడ్లు, డ్రెయిన్లను అభివృద్ధి చేసుకొని గ్రామ స్వరాజ్యాన్ని సాధించుకుందామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పిలుపు నిచ్చారు. శనివారం మండలంలోని పెదపులిపాకలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని స్థానిక నాయకులతో కలిసి గ్రామస్థుల సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. తన కుమార్తె దారుణ హత్యతో తాను సర్వస్వం కోల్పోయానని, తనకు ఆర్థికసాయం ఇప్పించమని గ్రామస్థురాలు వణుకూరు పుష్పవతి ఎమ్మెల్యేను కోరగా తాను వీలయినంత సాయం చేస్తానని హామీ ఇచ్చారు. పెదపులిపాక అభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో టీడీపీని క్షేత్రస్థాయి నుంచి పటిష్టపరచాలని టీడీపీ గ్రామాధ్యక్షుడు దాసరి హరినీడును ఆదేశించారు. ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధిని వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుంటూరు శ్రీనివాసచౌదరి, టీడీపీ మండల అధ్యక్షుడు కోయ ఆనంద్‌ప్రసాద్, మారుపూడి ధనకోటేశ్వరరావు, ముసునూరు శ్రీనివాసరావు, శ్రీధర్, గుజ్జర్లపూడి బాబూరావు, ముసునూరు నిర్మల్, నంగెపు రంగారావు, తుమ్మల రాంకుమార్, అబ్దుల్ సలాం, పండల రజిని తదితరులు పాల్గొన్నారు.

పెదపులిపాక పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా విశ్వేశ్వరరావు ప్రమాణ స్వీకారం

ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన పెదపులిపాక పీఏసీఎస్ అధ్యక్షునిగా గుంటూరు విశ్వేశ్వరరావు, డైరెక్టర్లుగా ముక్కామల అచ్చియ్య, కొండేటి దుర్గారావులు శనివారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. రైతులకు రుణాల అందించే విషయంలో పారదర్శకంగా పనిచేయాలని వారికి ఎమ్మెల్యే సూచించారు.



యనమలకుదురులో..

యనమలకుదురులో..

కూటమి ప్రభుత్వంతోనే మంచి పరిపాలన సాధ్యమయిందని యనమలకుదురు టీడీపీ నేతలు శొంఠి శివరాంప్రసాద్, మొక్కపాటి శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. శనివారం యనమలకుదురులో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో వారు పాల్గొని స్థానికులతో మాట్లాడారు. వైసీపీ హయాంలో జరగని అభివృద్ధి, సంక్షేమం, భరోసాలు టీడీపీ కూటమి ప్రభుత్వంలో చూడగలుగుతున్నామని స్థానికులు తెలిపారు. ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధిని వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తాడిశెట్టి వీరాస్వామి, బలగం కొండ తదితరులు పాల్గొన్నారు.



కానూరులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న శంకరబాబు

అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయం..

కానూరు : తాడిగడప మునిసిపాలిటీ కానూరు సనత్‌నగర్, సిద్ధిక్‌నగర్, మసీద్‌బజారు, రేకులబజారు తదితర ప్రాంతాల్లో శనివారం టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈ ప్రాంతాల్లోని ఇళ్లు, దుకాణాలల్లో శ్రేణులు కరపత్రాలు పంపిణీ చేసి రాష్ట్రంలో ఏడాది కాలంలో చేసిన అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా శంకరబాబు మాట్లాడుతూ, అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి షేక్ రఫీ, నేతలు ఎండీ రియాజ్, షేక్ ఇమాం, పువ్వాడ రమేష్, కోసూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చినఓగిరాలలో..

ఉయ్యూరు : అర్హులందరికి సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కట్టుబడి ఉన్నారని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి అన్నారు. చినఓగిరాలలో శనివారం పార్టీ మండల అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు, పార్టీ నాయకులతో కలసి పర్యటించి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇంటింటా తెలియజేసి, సమస్యలు అడిగితెలుసుకుని పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు నాగభూషణం, కంచర్ల కోటేశ్వరరావు, శివరామకృష్ణ, శివ, నరేంద్ర పాల్గొన్నారు.



చినఓగిరాలలో..



జంక్షన్ పోలీస్‌స్టేషన్‌లో శిక్షణ పొందుతున్న ట్రైనీ ఎస్సై

ట్రైనీ ఎస్సైగా ప్రశాంతి

హనుమాన్‌జంక్షన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : హనుమాన్‌జంక్షన్ ట్రైనీ ఎస్సైగా ఎన్. ప్రశాంతి శనివారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం టి.వెంకటాపురం గ్రామానికి చెందిన ప్రశాంతి 2023 బ్యాచ్ ఎస్సైగా ఎంపిక కాగా కృష్ణాజిల్లాకు కేటాయించారు. విశాఖపట్నం గ్రేహౌండ్స్, అనంతపురం పీటీసీ కాలేజీలో శిక్షణ పొందారు. అనంతరం బేసిక్ శిక్షణ నిమిత్తం జంక్షన్ పోలీస్ స్టేషన్‌కు కేటాయించారు. ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో ఆమె రెండు నెలలు పాటు ఇక్కడ శిక్షణ తీసుకోనున్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

హనుమాన్‌జంక్షన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ వీఎన్నార్ కాలేజీలో ఇంజనీరింగ్ చదువుతున్న జంక్షన్‌కు చెందిన పేద విద్యార్థి పర్వతనేని షణ్ముఖ సాయి ఆదిత్యకు మానవత జంక్షన్ శాఖ కాలేజీ ఫీజులు నిమిత్తం రూ.10,100లు ఆర్థిక సాయం అందజేసింది. శనివారం మానవత కార్యాలయంలో ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు విద్యార్థికి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత నిర్వాహకులు ఘంటా సత్యనారాయణ, ఇందిరాదేవి, జేవీవీ సత్యనారాయణ, వడ్డి రాజేశ్వరరావు, కొట్నేని రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



రేషన్ పంపిణీ చేస్తున్న డీలర్ కొండ

వృద్ధుల ఇంటి వద్దకే రేషన్

ఉయ్యూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాల మేరకు వికలాంగులు, 65 సంవత్సరాల వయస్సు దాటిన వృద్ధులకు ఇంటివద్దకే నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నట్టు ఏపీ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాగిత కొండ తెలిపారు. శనివారం వృద్ధుల ఇంటికి వెళ్లి రేషన్ పంపిణీ చేశారు. ఇంటింటికి వెళ్లి రేషన్ పంపిణీ చేయడం వలన డీలర్లకు అదనపు ఖర్చు అయి నప్పటికి ప్రభుత్వానికి సహకరిస్తున్నామని, ప్రతి నెలా 26 నుంచి 1వ తేదీ లోపు వికలాంగులకు,వృద్ధులకు ఇంటి వద్దే రేషన్ పంపిణీ చేస్తున్నామని తెలిపారు.



500 మందికి అన్నదానం

కంకిపాడు, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవలను మరింత విస్తృతం చేయనున్నట్లు లయన్స్ క్లబ్ కంకిపాడు అధ్యక్షుడు యుగంధర్ తెలిపారు. కంకిపాడులో శనివారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా యుగంధర్ మాట్లాడుతూ, లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి లయన్స్ సేవలను విస్తృతం చేయడం జరిగిందన్నారు. 500 మంది పేదలు ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు బండి నాంచారయ్య, జ్యోతి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

డ్రెయిన్లలో పూడికతీత

గన్నవరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ముందు చూపుతో ముంపునకు పరిష్కారం చూపించినట్లు కేసరపల్లి సాగునీటి సంఘం అధ్యక్షులు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ చైర్మన్ జాస్తి విజయ భూషణ్ కుమార్ (బుజ్జి) అన్నారు. మండలంలోని కేసరపల్లి, జక్కులనెక్కలం గ్రామాల్లో మైనర్ డ్రెయిన్-1 లో పూడికతీత పనులు శనివారం చేపట్టినట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ఎవరు పట్టించుకోకపోవడం వల్ల డ్రెయిన్లు మొత్తం పూడుకుపోయాయని చెప్పారు. అధిక వర్షాలు, వరదలు వచ్చినప్పుడు ఆ నీరంతా పంట పొలాల మీదే ఉంటుం దన్నారు. దీనివల్ల కష్టపడి పండించిన పంట వరదపాలు అవుతుందన్నారు. రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సూచనలను మేరకు సొంత నిధులు 1.50 లక్షలతో డ్రెయిన్‌లో పూడుకు తీత పనులు చేయించినట్లు తెలిపారు.

చిన్ననాటి నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



గన్నవరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చిన్న నాటి నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని సీఐ బీవీ శివ ప్రసాద్ అన్నారు. స్థానిక వీఎస్ సెయింట్ జాన్స్ పాఠశాలలో విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారోత్సవం వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్, సీజె థామస్, జిమ్మికురియోకోస్, భల్లాజోసఫ్, జయబాలన్ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు మెడల్స్

ఉయ్యూరు. జూలై 26 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్‌లో 17 డోగ్రా రెజిమెంట్‌లో జరిగిన నేషనల్ క్యాడెట్ కార్ప్స్‌లో ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొని మెడల్స్, సర్టిఫికెట్లు సాధించారు. పది రోజులపాటు జరిగిన నేషనల్ క్యాడెట్ కార్ప్స్‌కు ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల నుంచి 600 మంది విద్యార్థులు పాల్గొన గా కళాశాల క్యాడెట్స్ విశేష ప్రతిభ కనపరచి పతకాలు, సర్టిఫికెట్లు సాధించినట్టు ప్రిన్సిపాల్ శివనాథ్ తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శివ నాథ్, ప్రత్యేక అధికారి సత్యనారాయణ, ఎన్‌సీసీ ఆఫీసర్ పి. శ్రీరామ్ విద్యార్థులను అభినందించారు.

గిరిజన మహిళ లక్ష్మి కేసుపై డీఎస్పీ విచారణ

ఉయ్యూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : గిరిజన మహిళను వేధించిన కేసుకు సంబంధించి గన్నవరం డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు శనివారం విచారణ చేపట్టారు. చేయని దొంగతనాన్ని అంటగట్టి, వేధింపులకు గురి చేస్తున్నారని గిరిజన మహిళ వంగర లక్ష్మి యజమాని చిట్టూరి జగదీశ్వర్ శంకర్, అతని భార్య ఫిర్యాదు చేసింది.

బిల్డింగ్ పర్మిట్లపై లోకాయుక్తలో ఫిర్యాదు

ఉయ్యూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు నగర పంచాయతీ పరిధిలో అనధికార లే -అవుట్లలో నిర్మించిన రహదారి తొలగించకుండా అవినీతికి పాల్పడి అదే లే-అవుట్లలో నాలుగు భవనాల నిర్మాణానికి పర్మిట్లు జారీ చేసిన సీఆర్డీఏ, నగర పంచాయతీ కమిషనర్లపై ఏపీ ఉప లోకాయుక్తలో ఫిర్యాదు చేసినట్టు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ తెలిపారు. నగర పంచాయతీ కౌన్సిల్ తీర్మానం, కమిషనర్ అనుమతి లేకుండా ఏపీ సీఆర్డీఏ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ యాక్ట్‌కు వ్యతిరేకంగా కాటూరు రోడ్డులో అనధికా లే-అవుట్‌లో రహదారిని నగర పంచాయతీకి రిజిస్టర్ చేసారని తెలిపారు. 589, 591, 604/2, 589, 595/3, 604/1సర్వే నంబర్లలో 16.95 ఎకరాల అనధికార లేఅవుట్ల గుర్తించి నగర పంచాయతీ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు గతంలో మూడు నోటీసులు జారీ చేశారని తెలిపారు. అనధికార లే-అవుట్లను రెగ్యులర్ చేయనప్పటికి నిబంధనలకు వ్యతిరేకంగా సీఆర్డీఏ అధికారులు భవనాల నిర్మాణానికి అనుమతి ఇచ్చిన వైనాన్ని ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలిపారు.



గన్నవరంలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా కరపత్రాలు పంపిణీ చేస్తున్న వామపక్ష నాయకులు

ప్రజలపై విద్యుత్ భారాన్ని తగ్గించాలి

గన్నవరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం తొమ్మిది సార్లు కరెంట్ చార్జీలు పెంచి, ప్రజలపై రూ.32వేల కోట్ల భారం వేసిందని సీపీఐ ఏరియా కార్యదర్శి కాట్రగడ్డ రామచంద్రజోషి అన్నారు. విద్యుత్ చార్జీల నిలువు దోపిడీ ఆపాలని, ప్రమాదకర స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, ఆగస్టు 5న జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ పట్టణంలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామచంద్రజోషి మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచబోమని, తగ్గిస్తామని ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం మోసపూరిత వాగ్దానాలు చేసిందని మండిపడ్డారు. అధికారంలోకి రాగానే అదాని స్మార్ట్ మీటర్లు పేరుతో ప్రజలను దోచుకోవడానికి ప్రభుత్వాలు పూనుకున్నాయని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు, మిరప నాగేశ్వరరావు, సూరగాని సాంబశివరావు, నూతక్కి మోహనరావు పాల్గొన్నారు.

రూ. 1.52 కోట్లతో యనమలకుదురులో అభివృద్ధి పనులు

కానూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : తాడగడప మునిసిపల్ పరిధి యనమలకుదురులో రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 1.52 కోట్లు మంజూరు చేసిందని మున్సిపల్ కమిషనర్ షేక్ నజీర్ చెప్పారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విపత్తు, వరద నిధుల్లో భాగంగా ఈ నిధులు మంజూరయ్యాయని, దీనికి సంబంధించి అంచనాలు రూపొందించి మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్, ఉయ్యూరు ఆర్డీవోకు పంపుతామని పేర్కొన్నారు. అక్కడ నుంచి అనుమతులు వచ్చిన వెంటనే టెక్నికల్ మంజూరు అనంతరం టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. త్వరలో పనులు పూర్తిచేసి ప్రజలు అందుబాటులోకి తీసుకువస్తామని వివరించారు.

170మంది విద్యార్థులకు నేత్రపరీక్షలు

ఉయ్యూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఆకునూరులో ఉచిత వైద్యశిబిరం నిర్వహించి 170 మంది గ్రామస్థులు, పాఠశాల విద్యార్థులకు నేత్ర, దంత,బీపీ, షుగర్ పరీక్షలు చేసి ఉచితంగా మందుల పంపిణీ చేశారు. క్లబ్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి పలు విభాగాల వైద్య నిపుణులతో వైద్యపరీక్షలు జరిపించి, మందు లు అందజేస్తున్నామని క్లబ్ అధ్యక్షుడు సీహెచ్ నాగసుబ్రమణ్యం తెలిపారు. డాక్టర్ చంద్రమోహన్, రోటరీ నేత్ర, దంత వైద్యశాల వైద్యులు, సిబ్బంది, మేనేజర్ కోటిరెడ్డి, క్లబ్ మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, బిట్రా రామ్మోహన్‌రావు, కిరణ్, అమీర్ మీర్జా తదితరులు పాల్గొని సేవలందించారు.



ఎంపీ బాలశౌరిని సత్కరిస్తున్న వేలేరు కూటమి నాయకులు

ఎంపీ బాలశౌరికి ఘన సత్కారం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి) : వేలేరు-వీరవల్లి రహదారిలో మూసివేసిన రైల్వేగేటు ఎల్‌సీ 333 వద్ద ఆర్వోబీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన ఎంపీ వల్లభనేని బాలశౌరిని వేలేరు గ్రామస్థులు సత్కరించారు. బందరు కార్యాలయంలో ఎంపీ బాలశౌరిని శనివారం మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. వేలేరు ఆర్వోబీ నిర్మాణానికి రూ. 52.45కోట్ల నిధులు మంజూరు చేయించిన ఎంపీ బాలశౌరికి, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు, పాల సొసైటీ అధ్యక్షుడు దోనవల్లి రామారావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ అవిర్నేని భవానిశంకర్, జనసేన మండల ఉపాధ్యక్షుడు భూక్యా సమీర్‌నాయక్, బాణావతుల స్వామి, గోళ్ల శివనాగ మల్లేశ్వరరావు, అంగడాల సీతారామస్వామి, పోలగాని విజయ్‌కుమార్, షేక్ గౌస్, నాగూర్, బుర్రె బసవరాజు, చౌటపల్లి దేవ తదితరులు పాల్గొన్నారు.

రాచరికపు రాజసం!

ఐదు శతాబ్దాల జమీందారీ సంస్థానాల వైభవం

- ఎన్టీఆర్ జిల్లాలో ముక్త్యాల రాజా, మైలవరం రాజా ● కృష్ణాజిల్లాలో చల్లపల్లి రాజా
- దేవరకోట సంస్థానానికి రాజధానిగా చల్లపల్లి ● పర్యాటకులకు ఆకర్షిస్తున్న సంస్థానపు కోటలు


చల్లపల్లి కోట


ముక్త్యాలకోట

సండే స్పెషల్


ఎన్టీఆర్ జిల్లాలో ముక్త్యాల, మైలవరం, కృష్ణా జిల్లాలో చల్లపల్లి జమీందారీ సంస్థానాలు ఉన్నాయి. ఒకప్పటి ఉమ్మడి కృష్ణా జిల్లాలో నూజివీడు సంస్థానం కూడా ఉండేది, అదిప్పుడు ఏలూరు జిల్లా పరిధిలోకి వెళ్లింది. ఈ మూడు సంస్థానాలు ఐదు శతాబ్దాల చరిత్రను కలిగి ఉన్నాయి. జమీందారీ వ్యవస్థ రాచరికంతో కలిసి ఉండేది. ఈ ఐదు శతాబ్దాల్లో ఎందరో జమీందారీ రాజులు ఉమ్మడి కృష్ణా జిల్లాను పరిపాలించారు. వారిలో కొందరు మన తరం గుర్తుంచుకోదగ్గ రాజులు.

చల్లపల్లి సంస్థానం

ఈ సంస్థానం 448 ఏళ్ల చరిత్ర కలిగి, 190 చదరపు మైళ్ల వైశాల్యంతో, 66 గ్రామాలు, రెండు అగ్రహారాలు, పాలేలు, శివార్లతో సుమారు 100 గ్రామాలను కలిగి ఉండేది. రాజా యార్లగడ్డ గుర్వినీడు ప్రభువు ఈ వంశానికి మూలపురుషుడు. 1976లో మల్లిఖార్జునప్రసాద్ నాయుడు, 1921లో యార్లగడ్డ అంకినీడు ప్రసాద్ బహద్దూర్, 1929లో శివరామప్రసాద్ బహద్దూర్ పాలన చేపట్టారు. శివరామప్రసాద్ రాచరికంతో పాటు ప్రజాప్రతినిధిగా కృష్ణాజిల్లా పరిషత్ తొలి చైర్మన్‌గా, అవనిగడ్డ ద్విశాసన సభ్యుడిగా, రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రిగా సేవలందించారు. ఆయన రెండో కుమారుడు అంకినీడు ప్రసాద్ 1949లో భారత పార్లమెంటు సభ్యుడిగా పనిచేశారు. చల్లపల్లి రాజా ఆంధ్రాబ్యాంకు స్థాపనకు రూ.లక్ష మూలధనం ఇచ్చి, లక్ష్మీపురంలో చల్లపల్లి షుగర్స్ ఫ్యాక్టరీ స్థాపించి, హైదరాబాద్‌లో సారథి ఫిల్మ్ స్టూడియో నిర్మించారు. మాలపిల్ల, రైతుబిడ్డ చిత్రాలను నిర్మించారు. చల్లపల్లి కోట జగజ్జనని అమ్మవారి పూజలతో, మూడున్నర శతాబ్దాల చరిత్రతో పర్యాటకులను ఆకర్షిస్తుంది. 20 ఎకరాల్లో ఉన్న ఈ కోటలో అశోక వృక్షాలు, శిల్పసంపద, ఎత్తైన ద్వారాలున్నాయి. యార్లగడ్డ రామేశ్వరప్రసాద్ కోటను అభివృద్ధి చేశారు, కానీ ఇంకా మరమ్మతులు అవసరం.

ముక్త్యాల సంస్థానం

కృష్ణానదీ తీరంలోని జగ్గయ్యపేట సమీపంలో ఈ సంస్థానం ఉంది. వాసిరెడ్డి రామగోపాలకృష్ణ మహేశ్వర ప్రసాద్ రాజా నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి కృషి చేశారు. రైతులను చైతన్యపరిచి, సొంత నిధులతో డిజైన్లు,


చల్లపల్లి రాజావారు

రోడ్లు నిర్మించారు. ఖోస్లా కమిటీ నివేదిక ద్వారా ప్రాజెక్టుకు ఆమోదం లభించింది. 1955లో నెహ్రూ శంకుస్థాపన చేయగా, రాజా రూ.55 లక్షలు మ్యాచింగ్ గ్రాంట్ ఇచ్చారు. 1972లో జగ్గయ్యపేట ఎమ్మెల్యేగా గెలిచి, విద్యా వ్యాప్తి, హైస్కూళ్లు, ఎస్జీఎస్ కళాశాలకు చైర్మన్‌గా సేవలందించారు. ఆయన మరణానంతరం ఆయన సతీమణి రాజ్యలక్ష్మమ్మ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1956లో గౌతమ బుద్ధ 2500వ జయంత్యుత్సవాలు నిర్వహించారు. గత ఏడాది రాజా కాంస్య విగ్రహం జయంతిపురం జంక్షన్‌లో ఆవిష్కరించారు.

> మీలో ఎంతమందికి.. ప్రస్తుత ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలు పూర్వం జమీందారీ సంస్థానాల పరిధిలో ఉండేవని. నేటితరంలో కురువృద్ధులకు పరిచయం ఉన్నా యువతరానికైతే కథలుగా తెలుసుకోవటం తప్పితే వీటి గురించి పెద్దగా తెలియదనే చెప్పాలి. ప్రస్తుతం నాటి సంస్థానాధీశులు లేకపోయినా.. ఆ జ్ఞాపకాలను పంచే సంస్థానాలు నేటికీ సజీవంగా ఉన్నాయి. అవి నాటి జమిందారీ వైభవాన్ని చాటి చెబుతున్నాయి. మనకు దగ్గరే ఉన్నా ఆయా సంస్థానపు కోటల గురించి తెలుసుకోలేకపోతున్నాం. వీటి గురించి తెలుసుకోవాలనే ఉత్సుకతతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చి సందర్శించేవారు ఉంటున్నారంటే మనం ఆలోచన చేయాలి. మన జిల్లాల చరిత్రను తెలుసుకుని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉంది. ముఖ్యంగా ఈతరం తెలుసుకోవాల్సిన జమీందారీ కథలివి. ఈ ఆదివారం ఆంధ్రజ్యోతి అందిస్తున్న 'సండే స్పెషల్' ఇది!
> - ఆంధ్రజ్యోతి, చల్లపల్లి / జగ్గయ్యపేట / మైలవరం


ముక్త్యాల రాజావారు

మైలవరం సంస్థానం

మైలవరం జమీందారీ వ్యవస్థ రద్దయ్యే సమయంలో ఎస్వీఆర్‌జీ నరసింహారావు జమీందార్‌గా ఉన్నారు. ఆయన కుమారుడు సూరానేని వెంకట సుధాకరరావు ద్వారకా తిరుమల దేవస్థానం ధర్మకర్తగా, ఆధ్యాత్మిక వ్యాప్తికి కృషి చేస్తున్నారు. శ్రీ వేంకటేశ్వర స్వామి, ఆంజనేయ స్వామి, శివాలయం, కోట మహాలక్ష్మి ఆలయాలను అభివృద్ధి చేశారు. బాల భారతి నాట్య మండలి ద్వారా కళాకారులను ప్రోత్సహించారు. స్వామి తిరు కల్యాణ మహోత్సవాలు ప్రతి ఫిబ్రవరిలో ఘనంగా జరుగుతాయి. మైలవరం కోడి గుడ్డి మేడలు ప్రసిద్ధి చెందాయి, వీటిలో ఒకటి ప్రవాసాంధ్రుడు హనిమిరెడ్డి కొనుగోలు చేసి రీమోడలింగ్ చేశారు. ఇక్కడ సాయికుమార్ కుమారుడు ఆది సాయికుమార్ నటించిన సుకుమారుడు చిత్ర షూటింగ్ జరిగింది.


మైలవరం సంస్థానం


మైలవరం రాజా ఎస్వీ సుధాకరరావు

చిన్నారుల క్షేమం, సంక్షేమం రెండూ కీలకమే

- మిషన్ వాత్సల్యను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలి: కలెక్టర్ లక్ష్మీశ



మిషన్ వాత్సల్యలో చిన్నారులతో కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర సాకారం దిశగా చేస్తున్న ప్రయాణంలో శిశు వికాస కీలక ప్రగతి సూచికల (కేపీఐ)పై దృష్టిసారించాలని, ఇందుకు స్వచ్ఛంద సంస్థలు, శిశు సంక్షేమ కమిటీతో కలిసి పనిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులకు సూచించారు. శనివారం కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన కలెక్టరేట్‌లో మిషన్ వాత్సల్యపై సమన్వయ సమావేశం జరిగింది. మిషన్ వాత్సల్య లక్ష్యాలు, జిల్లాలో వాటి సాధనలో పురోగతిపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శిశు సంరక్షణ చట్టాలు, కుటుంబ ఆధారిత సంరక్షణకు ప్రోత్సాహం, సంస్థాగత మద్దతు, ఆర్థిక సహకారం, శిశు సంరక్షణ పథకాలు తదితరాల అనుసంధానంతో మిషన్ వాత్సల్య అమలుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిస్సహాయ స్థితి, అవసరాలున్న చిన్నారుల క్షేమం, సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిషన్ వాత్సల్యను అమలు చేస్తున్నాయని, 2023-24 నుంచి 2024-25 వరకు తల్లి లేదా తండ్రి లేని, తల్లిదండ్రులు లేని 18 ఏళ్ల లోపు 551 మంది బాలబాలికలకు ఈ పథకం ద్వారా నెలకు రూ.4వేలు చొప్పున దాదాపు రూ.2.73 కోట్లు ఆర్థిక సహాయం అందించడం జరిగిందన్నారు. ఐసీడీఎస్ పీడీ షేక్ రుక్సానా సుల్తానా బేగం, జువైనెల్ డిపార్ట్‌మెంట్ సూపరింటెండెంట్ రామ్మోహనరెడ్డి, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ సువార్త, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎం రాజేశ్వరరావు, డీపీవోలు సత్యవతి, జ్యోతి, సీడీపీవోలు, డీసీపీయూ సిబ్బంది, పర్యవేక్షకులు, బాలల కేంద్రాల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

నగర సమగ్రాభివృద్ధిలో భాగస్వాములు కండి

రాష్ట్ర నవ్య రాజధాని అమరావతికి గేట్‌వే నగరమైన విజయవాడ సమగ్రాభివృద్ధిలో ఎన్ఆర్‌వీలు (నాన్ రెసిడెంట్ విజయవాడయన్స్-ఎన్ఆర్‌వీయన్స్) భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్‌లో డాక్టర్ లక్ష్మీశ ఎన్ఆర్‌వీలతో పాటు పీబీ సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ అలుమ్ని అసోసియేషన్ ప్రతినిధులతో విజయవాడ నగరాభివృద్ధి, పీ4 విధానంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సాహిత్య, పర్యాటక కేంద్రంగా విరాజిల్లిన విజయవాడకు కొత్త వైభవం తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోందని, గౌరవ ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా వైబ్రెంట్ విజయవాడకు కృషిచేస్తున్నట్టు తెలిపారు. కనకదుర్గమ్మ ఆలయం, ప్రకృతి సోయగాల కృష్ణానదీతీరం, భవానీ ద్వీపంతో పాటు ఎన్నోచారిత్రక, వారసత్వ సంపదకు నెలవుగా ఉన్న విజయవాడ అభివృద్ధికి అందరి సలహాలు సూచనలతో ముందుకెళ్తున్నామన్నారు. నగరానికి ఓ బ్రాండ్ తెచ్చేలా కృషిచేస్తున్నామని, బ్రాండ్ టైటిల్, ట్యాగ్‌లైన్ కోసం ఇప్పటికే ఔత్సాహికుల నుంచి ఎంట్రీలు ఆహ్వానించామన్నారు. నగరం ఎంటర్‌ప్రెన్యూర్స్‌కు నిలయమని, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను పెద్ద ఎత్తున ప్రోత్సహించేందుకు కృషిచేస్తున్నామన్నారు. దసరా ఉత్సవాల సమయంలో విజయవాడ ఉత్సవ్‌ను ఘనంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఎన్ఆర్‌వీలతో పాటు పీబీ సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ అలుమ్ని అసోసియేషన్ కూడా బంగారు కుటుంబాలకు మార్గదర్శులుగా ముందుకు రావాలని కోరారు. దీనిపై స్పందించిన ఎన్నార్వీలు, అలుమ్ని అసోసియేషన్ ప్రతినిధులు తమ జీవితాలకు మార్గం చూపిన విజయవాడ అభివృద్ధితో పాటు పీ4 విధానంలో భాగమవుతామన్నారు. ఎన్ఆర్‌వీలు పీ సురేష్, వై మణిధర్, హర్షసాయితో పాటు పీబీ సిద్ధార్థ కళాశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ప్రతినిధులు స్వరూప్, ఏ ప్రశాంత్ చౌదరి, జీఎస్‌సీ బోస్, సుమబిందు అట్లూరి పాల్గొన్నారు.

దివ్యాంగుల పునఃపరిశీలన త్వరగా పూర్తి చేయాలి

ఎన్టీఆర్ భరోసా పింఛను పథకంలో విభిన్న ప్రతిభావంతులు (దివ్యాంగుల)లో పునఃపరిశీలన ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. పింఛన్ల పునఃపరిశీలన (రీ అసిస్మెంట్ ఆఫ్ పెన్షన్లు)లో భాగంగా జిల్లా గ్రామీణాభివృద్ధి, వైద్యారోగ్య, జిల్లా పరిషత్, మున్సిపల్ కమిషనర్లతో శనివారం కలెక్టర్ లక్ష్మీశ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 27,235 మంది విభిన్న ప్రతిభావంతులకు చెందిన లబ్ధిదారులు ప్రతినెల పింఛన్లు పొందుతున్నారన్నారు. వీరిలో 15,607 మంది లబ్ధిదారుల పునఃపరిశీలన పూర్తయిందని, మిగిలిన 11,628 లబ్ధిదారుల పునఃపరిశీలన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, డీఎంహెచ్‌వో ఎం సుహాసిని, డీసీహెచ్ఎస్ డాక్టర్ కేవీఎస్ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్లు ఉన్నారు.


మ్యాజిక్ డ్రెయిన్ల వివరాలను తెలుసుకుంటున్న డీపీవోలు

మ్యాజిక్ డ్రెయిన్లతో మురుగు సమస్య పరిష్కారం

- నిర్మాణ పనులు పరిశీలించిన డీపీవోలు, జడ్పీ సీఈవోలు

నందిగామ రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన మండలంలోని సోమవరం గ్రామంలో జరుగుతున్న మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణ పనులను జిల్లా డీపీవో లావణ్యకుమారితో కలిసి 25 జిల్లాల డీపీవోలు శనివారం పరిశీలించారు. ముందుగా ఏపీడీవోలు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు డీపీవోలకు మ్యాజిక్ డ్రెయిన్ల వివరాలు, పనితీరును వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 100 మీటర్ల డ్రెయిన్ నిర్మాణానికి రూ.90వేలు ఖర్చవుతుందన్నారు. ఈ నిర్మాణంతో మురుగు నీరు నిల్వ ఉండదని, క్రిమికీటకాలు సమస్య ఉండదన్నారు. అంతేకాక దుర్వాసనకు అవకాశం లేదని తక్కువ ఖర్చుతో మురుగు నీటి సమస్యను పరిష్కరించుకోవచ్చన్నారు. డ్రెయిన్ల వల్ల నీరు ఇంకటంతో భూగర్భజలాలు సైతం పెంపొందుతాయని చెప్పారు. అలాగే రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల జడ్పీ సీఈవోలు సోమవరం గ్రామంలోని మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణ పనులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. సీఈవోలకు ఏపీడీవోలు పూర్తి వివరాలను తెలిపారు. గ్రామంలో 2వేల మీటర్ల మేర డ్రెయిన్ల నిర్మాణం చేపట్టాల్సి ఉందని ప్రస్తుతానికి కలెక్టర్ వెయ్యి మీటర్లకు ప్రతిపాదించగా 500 మీటర్ల డ్రైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. నిర్మాణ పనులు, వివరాలు తెలుసుకున్న జడ్పీ సీఈవోలు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈవోపీఆర్డీ రామేశ్వరరావు, ఏపీవో శరత్, గ్రామ నేతలు ఉప్పుకొండూరు గురుప్రసాద్, శ్యాంప్రసాద్, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

జీతాల చెల్లింపులో జాప్యం నివారించాలి

- డెమోక్రటిక్ పీఆర్‌టీయూ డిమాండ్


పాఠశాల విద్యాశాఖ అదనపు డైరెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

గవర్నరుపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బదిలీలు పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడీలను కేటాయించి జీతాలు వెంటనే చెల్లించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డెమొక్రటిక్ పీఆర్‌టీయూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డీ శ్రీను, ప్రధాన కార్యదర్శి పీ వెంకటేశ్వరరావు శనివారం పాఠశాల విద్యాశాఖ అదనపు డైరెక్టర్ ఏ సుబ్బారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయుల ముఖ ఆధారిత హాజరు నమోదుకు గతంలో ఇచ్చిన హామీలను అనుసరించి ఉదయం 9 నుంచి 9.10 గంటల వరకు గ్రేస్ పీరియడ్‌గా ప్రకటించాలని, తెలుగు, హిందీ సబ్జెక్టులకు సంబంధించి పదోన్నతు లు కల్పించాలని, టెన్త్ స్పాట్ వాల్యూయేషన్, పరీక్ష నిర్వహణ, పాఠశాల నిర్వహణ గ్రాంట్లు, బకాయిలు తక్షణమే విడుదల చేయాలని, యాప్‌ల భారాన్ని తగ్గించి బోధనా సమయం పెరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో ఆయన ఉన్నతాధికారులతో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకొంటామని సుబ్బారెడ్డి తెలిపారు.


రోడ్ టెస్ట్ అనంతరం మహిళలకు కేటాయించిన బస్సు వద్ద అధికారులు

మహిళలకు ఉచిత బస్సు పథకానికి

బస్సులు సిద్ధం చేస్తున్నాం

- జిల్లా ప్రజా రవాణా అధికారి వెంకటేశ్వర్లు

అవనిగడ్డ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకానికి బస్సులు సిద్ధం చేస్తున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి కే వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం అవనిగడ్డ డిపోను పరిశీలించిన వెంకటేశ్వర్లు ప్రయాణికులకు మెరుగైన సేవలందించటమే ధ్యేయంగా పనిచేయాలని, ఆగస్టు 15 నుంచి ప్రారంభం కానున్న ఉచిత ప్రయాణానికి అనుగుణంగా బస్సులను తీర్చిదిద్దటంతోపాటు ఫిట్‌నెస్‌పై తగిన శ్రద్ధ చూపించాలన్నారు. డిపోలోని బస్సులను ఆయన పరిశీలించారు. డిపో మేనేజర్ కే హనుమంతరావు, మెకానికల్ అసిస్టెంట్ ఇంజనీర్ దివ్య పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో తరిద్దాం.. రండి!

- అమ్మ సేవకుల కోసం దేవస్థానం ఆహ్వానం ● దరఖాస్తుకు ఆన్‌లైన్ సదుపాయం



ఇంద్రకీలాద్రి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కనకదుర్గమ్మకు 'సేవ' చేసుకునే భాగ్యాన్ని భక్తులకు దుర్గగుడి కల్పిస్తోంది. ఇందుకోసం దరఖాస్తులు ఆహ్వానించింది. యావత్ దేశం నుంచి భక్తులు అమ్మ దర్శనానికి వస్తుంటారు. వారిసేవలో దేవస్థానం ఎన్నో కార్యక్రమాలను చేస్తుంటుంది. తోటి భక్తులకు వివిధ రూపాల్లో సేవ చేసుకునే మహద్భాగ్యాన్ని దేవస్థానం కల్పిస్తోంది.

దుర్గగుడిలో భక్తులకు సేవలందించి దుర్గమ్మ ఆశీస్సులు పొందేందుకు సేవక భక్త బృందాల నియామకానికి అధికారులు శ్రీకారం చుట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో భక్తులు ఎక్కువగా వచ్చే ఆలయాల్లో సేవక బృందాలను నియమించి భక్తుల రద్దీని నియంత్రించే సేవక బృందాల విధానం తిరుమలలో కొనసాగుతోంది. అలాగే మరికొన్ని ప్రధాన ఆలయాల్లోనూ ఈ సేవక బృందాలు పనిచేస్తున్నాయి. ఉచితంగా కేవలం భక్తిభావంతో అమ్మవారి చెంతన ఉండి భక్తులకు సేవలందించే సేవకులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. దుర్గగుడిలో సేవక బృందాల కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌ను ప్రారంభించారు. ఉచితంగా సేవ చేసే భక్త బృందాలకు ప్రాధాన్యమిస్తామని ఈవో శీనానాయక్ తెలిపారు. ఈ సేవక బృందాలు తొలుత 'కనకదుర్గమ్మ.ఓఆర్‌జి' వెబ్‌సైట్‌లో వలంటీర్ విభాగంలో జాయినయి పేరు, ఫోన్ నెంబరు, పూర్తి చిరునామా, ఫొటో, ఆధార్ వంటివి నమోదు చేయాల్సి ఉంటుంది. దీంతో సేవక బృందాలకు ఆలయంలో పనిచేసేందుకు సమయాలను కేటాయిస్తారు. ఎప్పుడు రావాలి, ఎన్ని రోజులు ఉండాలి వంటి వివరాలు తెలుపుతారు. వారికి వసతి, అన్నప్రసాద వితరణ, సామగ్రి భద్రపరచుకునేందుకు లాకర్, తాత్కాలిక గుర్తింపు కార్డు సమకూర్చుతారు. వారుండే ప్రాంతం నుంచి దేవస్థానానికి రవాణా వివరాలను మెసేజ్ రూపంలో అందిస్తారు.

తపాలాశాఖకు స్థల వితరణ

- దాతకు గ్రామస్థుల అభినందన



పామర్రు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జన్మనిచ్చిన గ్రామంలో ఏదైనా తనవంతు అభివృద్ధికి సహకరించాలనే సంకల్పంతో ముందుకొచ్చారు భారత రక్షణ దళంలో సేవలందించిన ఓ విశ్రాంత సిపాయి చెరుకూరి భవానీప్రసాద్, ఆయన సతీమణి సుధారాణి. పామర్రు మండలం జమీగోల్వేపల్లికి చెందిన గ్రామ అభివృద్ధి కమిటీ సహాయకార్యదర్శి మనోహర్‌రావు, ఆయన సతీమణి వీణాకుమారి స్ఫూర్తితో గ్రామంలో నూతన పోస్టల్ కార్యాలయ నిర్మాణానికి తనకు చెందిన రూ.6.30 లక్షల విలువైన 4 సెంట్ల స్థలాన్ని గుడివాడ డివిజన్ హెడ్ పోస్టాఫీస్ సూపరింటెండెంట్ ముత్యాల శ్రీనివాస్ సమక్షంలో అధికారులకు ఉచితంగా రిజిస్టర్ చేసి దస్తావేజ్ పత్రాలను అందించినట్టు శనివారం తెలిపారు. పోస్టల్ సూపరిండెంట్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పురాతన కాలం నుంచి జమీగోల్వేపల్లి గ్రామ ఉప తపాలాకార్యాలయం ప్రజలకు సేవలందిస్తోందన్నారు. నూతన తపాలా కార్యాలయానికి స్వచ్ఛందగా స్థలం వితరణ చేసిన దాత భవానీప్రసాద్‌ను అభినందనీయుడన్నారు. దాత స్థలంలో రూ.40 లక్షల నిధులతో నూతన పోస్టల్ కార్యాలయ భవనాన్ని నిర్మించేందుకు నిధులు మంజూరైనట్టు ప్రకటించారు. భవన నిర్మాణానికి ఇంత తక్కువ సమయంలో నిధులు మంజూరు చేయించడంలో ప్రత్యేక చొరవ చూపిన సూపరింటెండెంట్ శ్రీనివాసరావును స్థల దాతతోపాటుగా గ్రామ ప్రముఖులు ఏపీడీడీసీ మాజీ చైర్మన్ వల్లభనేని రాజేంద్రబాబు, విశ్వభారతి విద్యాసంస్థల చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ, ఆడిటర్ బోప్పుడి సుబ్రహ్మణ్యం ధన్యవాదాలు తెలిపారు.

వచ్చేనెల 18,19న ఢిల్లీలో బీసీల మహాధర్నా

- పోస్టర్ ఆవిష్కరించిన రాష్ట్ర ఇన్‌చార్జి నూకానమ్మ

చిట్టినగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): బీసీల సమస్యల పరిష్కారానికి జాతీయ స్థాయిలో జాతీయ బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో ఆగస్టు 18,19న న్యూఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద మహాధర్నా జరుగుతుందని, రాష్ట్రంలోని వెయ్యి మంది బీసీ నేతలు పాల్గొంటారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జి వై నూకానమ్మ పేర్కొన్నారు. శనివారం చిట్టినగర్ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో చలో ఢిల్లీ వాల్ పోస్టర్‌లను ఆమె బీసీ నేతలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటుకు బీసీ నేతలుగా తాము కృషి చేశామన్నారు. దేశవ్యాప్తంగా బీసీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఆగస్టు 18,19 తేదీల్లో జరిగే మహా ధర్నా విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. తమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మహాధర్నా విజయవంతానికి కృషి చేస్తున్నామన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కనిశెట్టి లక్ష్మణరావు మాట్లాడుతూ బీసీల సమస్యల పరిష్కారానికి తమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య ఇప్పటివరకు వేలాది పోరాటాలు చేశారన్నారు. సంఘం రాష్ట్ర లీగల్ సలహాదారు పిళ్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ బీసీల సమస్యల పరిష్కారానికి ఆర్ కృష్ణయ్య నాయకత్వంలో తామంతా కృషి చేస్తున్నట్లు వివరించారు. ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నమ్మి భాను ప్రకాష్ యాదవ్, విజయవాడ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ బాడిశ రూపేష్, జిల్లా సెక్రటరీ తమ్మిన దుర్గారావు, సిటీ యువజన అధ్యక్షుడు పీసా అరుణ్ కుమార్, సెంట్రల్ నియోజకవర్గ అధ్యక్షుడు సత్యాల సతీష్, జిల్లా మహిళా అధ్యక్షురాలు జీ లీల పాల్గొన్నారు.



స్థానిక ఎన్నికలకు నేతలు సిద్ధం కావాలి

- మంత్రి కొల్లు రవీంద్ర

కంకిపాడు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఆరు నెలల్లో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి నేతలు సిద్ధం కావాలని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కంకిపాడులోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో మంచి పాలన సాగుతోందన్నారు. సుపరిపాలనలో తొలి అడుగుకు నేతలు వెళ్తుంటే ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. రానున్న 6 నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లోనూ కూటమి నేతలు విజయం సాధించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ సాయంతో పవన్ కల్యాణ్ చొరవతో ఇప్పటికే రాష్ట్రంలో 90 నుంచి 100 శాతం రోడ్లు పూర్తయ్యాయన్నారు. రానున్న ఏడాదిలో డ్రైనేజీలు కూడా పూర్తి చేస్తామన్నారు. అనంతరం స్థానిక తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగ జయప్రకాష్ ఆధ్వర్యంలో మంత్రి కొల్లు రవీంద్రను దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. క్లస్టర్ కో కన్వీనర్ పులి శ్రీనివాసరావు, ఏఎంసీ డైరెక్టర్ గోగినేని వెంకటరమణ, పచ్చిపాల రాజ, పావనమూర్తి, బాజి పాల్గొన్నారు.

విషజ్వరాలతో వణుకుతున్న పల్లెలు

- రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు యువకుల మృతి

ఎ.కొండూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో విష జ్వరాలు పట్టిపీడిస్తున్నాయి. గ్రామాల్లో పరిశుద్ధ్యం లోపం, మురుగు నిల్వలు, డ్రైనేజీ సమస్యలు ప్రజల పాలిట శాపలుగా మారి జ్వరాల రూపంలో ప్రాణాలు హరిస్తున్నాయి. అధిక వర్షాలకు మురుగు నీరు పేరుకుపోయి దోమలు విజృంభిస్తున్నాయి. 10 రోజుల నుంచి విష జ్వరాలు సోకిన బాధితులు ఆర్ఎంపీలు, ప్రైవేట్ డాక్టర్ల వద్ద వైద్య సేవలు పొందుతున్నారు. మండలంలోని చీమలపాడు గ్రామానికి చెందిన మునగపాటి బాబు(32)కి జ్వరం రావ్వడంతో స్థానికంగా వైద్యవ చేయించుకున్నాడు. మలేరియా, టైఫాయిడ్ లక్షణాలు కనిపించడంతో విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. రెండు రోజుల క్రితం కృష్ణారావుపాలెం శివారు గ్రామ తండాకు చెందిన అజ్మీర రమేష్ (30) అనే వ్యక్తి తీవ్ర జ్వరంతో బాధపడుతూ గురువారం మృతి చెందాడు. రెండు రోజుల్లోనే ఇద్దరు యువకులు మృతి చెందడంతో ప్రజల్లో భయందోళనలు నెలకొన్నాయి. గ్రామాల్లో, తండాలో జ్వర బాధితులు ఎక్కువగా కనిస్తున్నారు. సీజనల్‌గా వచ్చే జ్వరాలపై పంచాయతీలు, ఆరోగ్య శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. వెంటనే గ్రామాల్లో సర్వేలు నిర్వహించి, వైద్య శిబిరాలు, పరిశుద్ధ్య పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఇదిలా ఉండగా బాబు చీమలపాడు గ్రామానికి చెందిన మునగపాటి బాబు అకాల మృతి టీడీపీకి తీరని లోటని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. గురువారం ఆయన గ్రామంలో బాబు మృతదేహంపై పార్టీ జెండా కప్పి ఘనంగా నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 475

నేటి నుంచి తిరునక్షత్ర వేడుకలు

గుడివాడ, జూలై 26(ఆంధ్రజ్యోతి): పాటిమీద వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం నుంచి తిరునక్షత్ర వేడుకలు నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు శనివారం ఒక ప్రకటనలో తెలిరు. మంగళవారం రైల్వేస్టేషన్ వద్ద చలసాని ఇందిరారమణరావు స్వగృహం నుంచి మేళ తాళాలు, కోలాట నృత్యాలతో అమ్మవారికి తిరుమంజన పూజాసామగ్రి, శ్రావణ పట్టి(సారె)తో గొప్ప ఊరేగింపుగా దేవస్థాన ప్రాంగణానికి చేరుకుంటామని, పూజాది కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో విష్ణు ప్రసాద్

ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చూడండి

ఎంపీడీవో విష్ణుప్రసాద్

గుడివాడ రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పేదల గృహాల నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చూడాలని మండలంలోని పంచాయతీల కార్యదర్శులకు ఎంపీడీవో విష్ణుప్రసాద్ సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్, పీ-4 తదితర అంశాలపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడి గృహాలు త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాలను ప్రతీ కార్యదర్శి పూర్తి చేయాలన్నారు. పీ-4 నిర్దేశించినట్లుగా దాతలను గుర్తించి బంగారు కుటుంబాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో జి.శ్రీనివాసరావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు పంచాయతీలో రికార్డుల పరిశీలన



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎల్‌పీవో బృందం

గుడ్లవల్లేరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): పంచాయతీలో నిధుల అవకతవకలపై పంచాయతీరాజ్ శాఖ నియమించిన విచారణ బృందం శనివారం కార్యాలయంలో విచారణ జరిపింది. గత నాలుగు సంవత్సరాల రికార్డులను డీఎల్పీవో జి.సంపత్ కుమారి పరిశీలించారు. సిబ్బందిని పలు అంశాలపై ప్రశ్నించారు. రికార్డులను పరిశీలించి నివేదికను డీపీవోకు సమర్పిస్తామని డీఎల్పీవో తెలిపారు. విచారణ బృందం సభ్యులు ఆరుగొలను కార్యదర్శి పి.సురేష్ కుమార్, చిరిచింతల కార్యదర్శి కె.అనూల, కలవపూడి అగ్రహారం కార్యదర్శి జె.అవ్వమ్మ, జనార్దనపురం కార్యదర్శి సందీప్ పాల్గొన్నారు.



కార్యకర్త నుంచి వివరాలు సేకరిస్తున్న సిడిపివో ప్రసన్న విశ్వనాథ్

ఐసీడీఎస్‌కు పీఎం మాతృత్వ యోజన

● సీడీపీవో ప్రసన్న విశ్వనాథ్

కూచిపూడి, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన పథకాన్ని వైద్యఆరోగ్యశాఖ పరిధి నుంచి ఐసీడీఎస్‌కు బదలాయిస్తున్నారని మొవ్వ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి ప్రసన్న విశ్వనాథ్ తెలిపారు. శనివారం కూచిపూడిలోని పలు అంగన్వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో మూడు నుంచి ఆరేళ్ల లోపు ప్రీ స్కూల్ పిల్లలకు ఆధార్ కార్డు తరహాలో ఆపార్ ఐడీని యాప్‌లో కార్యకర్తలు పొందుపరుస్తున్నారని తెలిపారు. సూపర్‌వైజరు ఏఎస్ కల్యాణి, కార్యకర్తలు ఎం.సరస్వతి, సుజ్ఞానం పాల్గొన్నారు.

పూడికతీతతో వరినాట్లు భద్రం



తోట్లవల్లూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): వల్లూరుపాలెం వద్ద ఏనుగులకోడు డ్రెయిన్ కింద వరినాట్లు ప్రతి ఏడాదీ భారీ వర్షాలకు ముంపునకు గురవుతుండేవి. వరినాట్లు చనిపోతూ రెండో సారి అష్టకష్టాలుపడి నాట్లు వేయాల్సి వచ్చేది. అయితే ఈ ఏడాది జూన్‌లోనే రూ.9 లక్షలతో ఏనుగులకోడు డ్రెయిన్‌లో గుర్రపుడెక్క తొలగించి బాగుచేశారు. తూడు లేకుండా శుభ్రంగా ఉండడంతో తొమ్మిది రోజులుగా వర్షాలు కురుస్తున్నప్పటికీ వరినాట్లు ముంపు బారిన పడలేదని వల్లూరుపాలెం సాగునీటి వినియోగదారుల సంఘం కాట్రగడ్డ రవీంద్రబాబు తెలిపారు. మురుగు దిగువకు సాఫీగా వెళుతోందని, బందరు కాలువలోకి కూడా షట్టర్లు తెరిచి మురుగు పంపించటంతో వరినాట్లు ముంపు బారిన పడలేదని తెలిపారు.

గుర్రపు డెక్క తొలగించాలి

కూచిపూడి, జూలై 26(ఆంధ్రజ్యోతి): డ్రెయిన్లలో పేరుకుపోయిన గుర్రపు డెక్క కారణంగా రైతులు పలు అవస్థలు పడుతున్నారని డెక్కను తొలగించి రైతులను ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా డ్రెయిన్లలో గుర్రపు డెక్క అడ్డంకిగా మారిందన్నారు. కాజ, చినముత్తేవి, వేములమడ, పద్దారాయుడు తోట తదితర గ్రామాల్లోని డ్రెయిన్లలో గుర్రపు డెక్క పేరుకుపోయిన కారణంగా చినముత్తేవి, పెదముత్తేవి, కారకంపాడు, పెదపూడి, మొవ్వ, కూచిపూడి, నిడుమోలు గ్రామాల్లో నాట్లు వేసిన పొలాలు ముంపు బారిన పడి రైతులు నష్టపోయారని అన్నారు.

పీ-4తో వసతిగృహాలు అభివృద్ధి చెందవు

● ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సమరం

గుడివాడ, జూలై 26(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ వసతిగృహాలను పీ-4 ద్వారా అభివృద్ధి చేస్తామని మంత్రి సవిత ప్రకటించడం సరికాదని, పీ-4 అమలుతో వసతిగృహాలు ప్రైవేట్‌పరం లేదా మూసివేతకు దారి తీస్తాయని, ఆ ఆలోచనను విరమించుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి ఎస్.సమరం డిమాండ్ చేశారు. శనివారం కామ్రేడ్ సుందరయ్యభవన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీసీ వసతిగృహాల్లో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ వసతిగృహాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని, అద్దె భవనాల్లో నడుస్తున్న వసతిగృహాలకు సొంత భవనాలు నిర్మించాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు.

విఘ్నేశ్వరస్వామి దేవస్థానానికి విరాళాలు అందజేత

గుడివాడ, జూలై 26(ఆంధ్రజ్యోతి): మెయిన్‌రోడ్డులో విఘ్నేశ్వర స్వామి దేవస్థానం పైభాగాన ఏర్పాటు చేస్తున్న దేవతామూర్తుల విగ్రహాలను చెక్కించడానికి శనివారం బచ్చు సుబ్రహ్మణ్యం, సుజాత దంపతులు రూ.10,116, ధనాజీ భగవాన్ పడతారి, జయలక్ష్మి దంపతులు రూ.10,116 విరాళంగా అందజేశారని ఆలయ ఈవో వై.శ్రీనివాసరావు(వాసు) తెలిపారు. అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

● ఎంపీ వల్లభనేని బాలశౌరి



మల్టీపర్పస్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపి బాలసౌరి, చిత్రంలో ఎమ్మెల్యే రాము తదితరులు

గుడ్లవల్లేరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): 'మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో రహదారులు, తాగునీటి సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషిచేస్తున్నాం. జల్‌జీవన్ మిషన్ ద్వారా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో తాగునీటి ప్రాజక్టుకు రూ.6వేల కోట్ల ప్రతిపాదనలు ఇచ్చాం.' అని ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. శనివారం అంగలూరులో ఎస్‌హెచ్‌పీసీ సంస్థ సీఎస్ఆర్ నిధులు రూ.32 లక్షలతో నిర్మించిన మల్టీపర్పస్ భవనాన్ని ఎమ్మెల్యే వెనిగండ్ల రాముతో కలిసి ఆయన ప్రారంభించారు. గుడివాడ - కంకిపాడు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు పేపర్‌వర్క్ సిద్ధం చేశామని, కేంద్ర మంత్రితో మాట్లాడానని ఆయన తెలిపారు. మామిడికోళ గ్రామస్థులు తమ గ్రామానికి రహదారి నిర్మించాలని కోరగా 50 శాతం ప్రజల వాటాగా నిధులు ఇచేందుకు ముందుకు వస్తే మిగిలిన నిధులు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో మాట్లాడి తెచ్చేందుకు ప్రయత్నిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అంగలూరు శ్మశానవాటిక అభివృద్ధికి ఎన్ఆర్ఐల సహకారం కోరాలని మిగిలిన నిధులకు తాను ప్రయత్నిస్తానని తెలిపారు. ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవికుమార్, సర్పంచ్ మేడేపల్లి రవికుమార్, డీసీ చైర్మన్ పాలేటి ఆంజనేయులు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, కొడాలి రామరాజు, శాయిన పుష్పావతి, పేర్ని జగన్, తోట చిన్నారి పాల్గొన్నారు.

వైసీపీ బాయ్‌కాట్ పిలుపుతో హరిహర వీరమల్లు చూడడం ఆగదు : బాలశౌరి

'హరిహర వీరమల్లు సినిమా ఒక చిత్రం కాదు. ప్రజల్లో చైతన్యం కల్గించే స్ఫూర్తి మంత్రం. వైసీపీ బాయ్‌కాట్ చేస్తున్నట్టు పిలుపునిచ్చినంత మాత్రాన సినిమా చూడడం ఆగిపోదు. అది వారి అవివేకం' అని ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు.

కోట్లాది రూపాయలతో రోడ్లు నిర్మించాం : వెనిగండ్ల రాము

గుడ్లవల్లేరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వమొచ్చాక ఏడాది కాలంలో గ్రామాల్లో కోట్లాది రూపాయలతో అంతర్గత సీసీ రోడ్లు నిర్మించామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శనివారం అంగలూరులో నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు మేకా వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ పొట్లూరి రవికుమార్, డైరెక్టర్ అనగాని లీలా కృష్ణ, బొర్రా ధనకోటేశ్వరరావు, పెద్దిబోయిన లక్ష్మీనరసింహరాజు, చప్పిడి వీరబ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.

ఈదులమద్దాలిలో..

పెదపారుపూడి: ఈదులమద్దాలిలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు కనుమూరి ఈశ్వర్ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. జనసేన పార్టీ నాయకుడు బండ్రెడ్డి బాబు, టీడీపీ నాయకులు నల్లూరి చిన్నా, కొల్లూరి హనుమంతరావు, శ్రీపతి బ్రహ్మశాస్త్రులు, పరసా కృష్ణ, బత్తుల కోటి, రాజులపాటి ధర్మేంద్ర, పర్వతనేని ధర్మయ్య పాల్గొన్నారు.

వాహన తనిఖీ కేంద్రాన్ని స్థానికంగానే ఉంచాలి

● ఆలిండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్



ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గుడివాడ, జూలై 26(ఆంధ్రజ్యోతి): స్థానికంగానే వాహన తనిఖీ కేంద్రం ఉండేలా చూడాలని ఆలిండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు శనివారం ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యంకు వినతిపత్రాన్ని అందజేశారు. ఫిట్‌నెస్ పరీక్షలను కార్పొరేట్ వారికి ప్రభుత్వం అప్పగించడంతో వాహనదారులకు పెనుభారంగా మారిందని ఆటో అండ్ ప్రైవేటు మోటార్ ట్రాన్స్‌పోర్టు యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.పోలినాయుడు అన్నారు. ప్రస్తుతం కార్పొరేట్ సంస్థ ఆధీనంలో ఉన్న ఏటీఎస్ సెంటర్‌ను గుడివాడకు 60 కిలోమీటర్ల దూరంగా ఏర్పాటు చేశారన్నారు. దీంతో వాహన యజమానులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. తక్షణమే వాహన తనిఖీ కేంద్రాన్ని గుడివాడలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు కె.విజయ్‌కుమార్, ఒ.నాగేంద్ర, పెద్దింటి సురేష్, షేక్ అన్వర్‌బాషా, శొంఠి వెంకటేశ్వరరావు, కె.రాము, వై.సాల్మన్‌రాజు, ఎస్.మోహన్‌బాబు పాల్గొన్నారు.



పీఏసీఎస్ కమిటీకి అభినందనలు

రొయ్యూరు పీఏసీఎస్ కమిటీ ప్రమాణ స్వీకారం

తోట్లవల్లూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రొయ్యూరు పీఏసీఎస్ త్రిమెన్ కమిటీ శనివారం ప్రమాణస్వీకారం చేసింది. చైర్మన్‌గా లుక్కా రేణుకారావు, సభ్యులుగా మోర్ల అప్పయ్య, లుక్కా నాగబాబుతో సీఈవో పి.అనీల ప్రమాణ స్వీకారం చేయించారు. పీఏసీఎస్ ద్వారా రైతులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తానని రేణుకారావు తెలిపారు. ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రమాణస్వీకారం చేసిన పాలకవర్గాన్ని టీడీపీ గ్రామ అధ్యక్షుడు లుక్కా వెంకట రమణ, నిమ్మగడ్డ రాకేష్, లుక్కా ఓంకారం అభినందించారు.

స్టేడియం వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

గుడివాడ, జూలై 26(ఆంధ్రజ్యోతి): నీలామహల్ రోడ్డులోని విజయదుర్గ అమ్మవారి దేవస్థానం కాలక్షేప మండపంలో ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం విజయవాడ ఒమేగా ఆస్పత్రి వైద్య బృందంతో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని డాక్టర్ శ్వేత ప్రారంభించారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు లోయ ఈశ్వర వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు కోన రామారావు, కార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి రామ్మోహన్, సభ్యులు పాల్గొన్నారు.

నేడు పెన్షనర్ల సంఘ సమావేశం

గుడివాడ, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఎన్జీవోస్ హోంలో ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు సంఘం అధ్యక్షుడు భవిరి శంకరనాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం నూతనకార్యవర్గ ఎన్నిక ఉంటుందన్నారు. అతిథులుగా పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.రామస్వామి, ప్రధాన కార్యదర్శి అంబటి వరప్రసాద్, ఎన్జీవోస్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బీవీ సుబ్బారావు, ఖజానా అధికారి జ్యోతిశ్వరరావులు హాజరవుతారని పేర్కొన్నారు.

ట్రూ అప్, సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలి

● ఎల్ఐసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కిషోర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్ఐసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కిషోర్

గుడివాడ, జూలై 26(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రూ అప్ చార్జీలు, సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్‌మీటర్లు బిగించడాన్ని ఉపసంహరించుకోవాలని ఎల్ఐసీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి కిషోర్ డిమాండ్ చేశారు. శనివారం భవన నిర్మాణ కార్మిక సంఘం భవన్‌లో నిర్వహించిన స్మార్ట్‌మీటర్ల వ్యతిరేక ఐక్య ప్రజా వేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మచిలీపట్నం, గుడివాడ వంటి ముఖ్య ప్రాంతాలను ఎంచుకుని అదానీ స్మార్ట్‌మీటర్లు బిగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 20ఏళ్ళ పాటు ఒప్పందం చేసుకుని ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని మోపుతోంద న్నారు. ఇప్పటికే 50శాతం మేర మీటర్లను బిగించారన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని ఆపకపోతే ప్రజాఉద్యమం తప్పదని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్సీపీ రెడ్డి, ఐద్వా జిల్లా నాయకులు పి.రజిని, సీఐటీయూ నాయకులు రేపాని కొండ, సీహెచ్ శివ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.సమరం పాల్గొన్నారు.

1.3 కేజీల గంజాయి స్వాధీనం

ఐదుగురు విక్రేతల అరెస్టు

గుడివాడ, జూలై 26(ఆంధ్రజ్యోతి): ధనియాలపేట సమీపంలోని రైల్వే ట్రాక్ పక్కన డొంక రోడ్డులో గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు యువకులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 1.3 కేజీల గంజాయిను స్వాధీనం చేసుకున్నామని వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోర్టులో హాజరుపరచగా వారికి రిమాండ్ విధించారని, నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించామని తెలిపారు. స్టేషన్ పరిధిలో ఎవరైనా గంజాయి రవాణా చేసినా, అమ్మినా చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

పేకాట శిబిరంపై పోలీసులదాడి

● 9మంది అరెస్టు, రూ.1.53లక్షలు స్వాధీనం

పామర్రు, జూలై 26(ఆంధ్రజ్యోతి): నిభానుపూడి కాల్వగట్టుపై నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై సీఐ సుభాకర్ సిబ్బందితో శనివారం దాడి చేశారు. పేకాట, చిత్తులాట ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.లక్షా 53 వేలు, రెండు కార్లు, 11 ద్విచక్రవాహనాలను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. వారిపై కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు.

అధ్వానంగా రహదారులు



కురుమద్దాలి గ్రామ సచివాలయం రోడ్డు

(ఆంధ్రజ్యోతి-పామర్రు): కురుమద్దాలిలో ప్రధాన సెంటర్ నుంచి పాత కురుమద్దాలికి వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. రోడ్డుపై గుంతల కారణంగా గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారు. గోతుల్లో వర్షపు నీరు నిలిచి ఉండడంతో అంగన్వాడీ కేంద్రం, ఎంపీపీ పాఠశాలకు వెళ్లే విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నిధులు మంజూరుకాగానే పనులు ప్రారంభిస్తాం

కురుమద్దాలి సెంటరు నుంచి పాత కురుమద్దాలి హరిజనవాడకు, జగనన్న కాలనీలకు వెళ్లే రహదార్ల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపుతాం. నిధులు మంజూరుకాగానే పనులు ప్రారంభిస్తాం.

\- పి.రామారావు, పంచాయతీరాజ్ మండల ఏఈ

ఆశా వర్కర్స్ మండల కమిటీ

పెదపారుపూడి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్స్ మండల నూతన కమిటీని శనివారం మండల మహాసభలో ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా కె.పద్మశ్రీ, కో-కన్వీనర్‌గా నాగేశ్వరమ్మ, ఐదుగురు సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షురాలిగా సీఐటీయూ మండల కన్వీనర్ ఉప్పలపాటి అనూషను ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శి ధనశ్రీ, గంగాధర్ ప్రసాద్, పుష్ప, విజయకుమారి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242



నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 475

4న మేళ్లమర్తిలంకలో గంగానమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠ

మోపిదేవి, జూలై 26(ఆంధ్రజ్యోతి): మేళ్లమర్తిలంకలో గంగానమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠా మహోత్సవాన్ని ఆగస్టు 4వ తేదీ నిర్వహిస్తామని, ఆలయ నిర్వాహకుడు, చల్లపల్లి మాజీ ఎంపీపీ యార్లగడ్డ సోమశేఖర ప్రసాద్(లంకబాబు) తెలిపారు. పూజా కార్యక్రమాల్లో భాగంగా 3వ తేదీన గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, అంకురారోపణ, పంచగవ్య ప్రాసన, అమ్మవారి విగ్రహానికి పంచామృత అభిషేకాలు, మండపారాధన, అమ్మవారి మంత్ర హోమం, ధాన్యాదివాసం, పుష్పాదివాసం, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహిస్తామని ఆయన తెలిపారు. 4వ తేదీన విగ్రహ పునఃప్రతిష్ఠ జరుగుతుందని, ఉదయం 11 గంటల నుంచి అన్నసమారాధన నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

పీ-4 అమలులో రాష్ట్రంలో అవనిగడ్డ మొదటి స్థానంలో నిలవాలి

● ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

అవనిగడ్డ రూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): పీ-4 అమలులో నియోజకవర్గం రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆకాంక్షించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పీ-4 అమలుపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జవాబుదారీతనం, అవినీతి రహితంగా అధికారులు విధులు నిర్వహించాలని సూచించారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి పి.సాయిబాబు, ఎంపీడీవోలు మరియాదేవి, సుధాప్రవీణ్, తహసీల్దార్లు వీరాంజనేయప్రసాద్, సౌజన్య కిరణ్మయి, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

మురారి సాత్విక్‌కు అభినందన

చల్లపల్లి, జూలై 26(ఆంధ్రజ్యోతి): పీ-4 కార్యక్రమంలో మార్గదర్శిగా నిలిచిన మురారి సాత్విక్‌ను పంచాయతీ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు శనివారం సత్కరించి, అభినందించారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, నియోజకవర్గ ప్రత్యేకాధికారి పి.సాయిబాబు, ఎంపీడీవో ఏవీ రమణ, ఎంపీపీ కోట విజయరాధిక, టీడీపీ నేత మోర్ల ప్రసాద్, ఈవో పివి.మాధవేంద్రరావు, వేముల సౌజన్య పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్లు రద్దు చేయాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు

మచిలీపట్నం టౌన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు డిమాండ్ చేశారు. శనివారం 37వ డివిజన్‌లో సీపీఎం నాయకులు ఇంటింటి పర్యటన చేశారు. ఐదేళ్లలో అప్పటి ప్రభుత్వం తొమ్మిది సార్లు కరెంటు చార్జీలు పెంచి ప్రజలపై రూ.32వేల కోట్ల భారం వేసిందన్నారు. కూటమి ప్రభుత్వం సర్దుబాటు చార్జీల పేరుతో ఏడాదిలో రూ.1548 కోట్లు అదనపు భారం మోపిందన్నారు. 2014 నుంచి 2019 వరకు ఐదేళ్లలో వాడుకున్న విద్యుత్‌కు రూ.3000 కోట్ల ట్రూ అప్ చార్జీలు విధించారన్నారు.

బహిర్భూమికి వెళ్లి కాలువలో పడి వ్యక్తి మృతి

కోడూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు మురుగు కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన పాలకాయితిప్పలో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డ మస్తాన్(39) ఉదయం గ్రామ సమీపంలోని(సింకు) మురుగు కాలువ వద్దకు బహిర్భూమికి వెళ్లాడు. ఫిట్స్ రావటంతో నీటిలో పడిపోయాడు. ఎవరూ చూడకపోవటంతో మృతి చెందాడని మృతుని తండ్రి కొక్కిలిగడ్డ మహాలక్ష్మణుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించామని ఎస్సై చాణక్య తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పాముకాటుకు మహిళ మృతి

కోడూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): పాముకాటుతో మహిళ మృతి చెందిన ఘటన జరుగువానిపాలెంలో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన పచ్చా లక్ష్మి(35) ఇంట్లో వంట చేసుకుంటుండగా వెనుకగా పాము వచ్చి కాలిపై కాటేసింది. వెంటనే మందపాకల పీహెచ్‌సీకి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం అవనిగడ్డ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. మార్గం మధ్యలో మృతి చెందినట్లు ఆమె కుటుంబసభ్యులు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి వారి కుటుంబసభ్యులకు అప్పగించామని ఎస్సై చాణక్య తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.

గ్రంథాలయాలకు స్మార్ట్ ఫోన్లు బహూకరణ

మచిలీపట్నం టౌన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శనివారం శివశ్రీ చారిటబుల్ ట్రస్టు, శిక్షణ ఫౌండేషన్ ప్రతినిధులు జిల్లాలోని 70 గ్రంథాలయాలకు కంప్యూటర్లు, స్మార్ట్ టీవీ, స్మార్ట్‌ఫోన్లు అందించారు. ఉచిత ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించారు. గ్రంథాలయాల్లో చదువుకుని ఉద్యోగాలు సాధించిన వారు ఫ్యాన్లు బహూకరించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ కార్యదర్శి వి.రవికుమార్, శిక్షణ ఫౌండేషన్ ప్రతినిధులు డి.సత్యనారాయణ, రాజారావు, బుచ్చిబాబు, కార్తీక్, జిల్లా కేంద్ర ఉప గ్రంథాలయాధికారి బి.వెంకటరమణ, సీనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్, నగేష్ పాల్గొన్నారు.



స్మార్ట్ ఫోన్లు బహూకరిస్తున్న శివశ్రీ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు

అయ్యగారి రామ్మూర్తి పంతులు
ముందుచూపు అందరికీ ఆదర్శం

● బెల్ జీఎం జితేందర్‌సింగ్

మచిలీపట్నం టౌన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): మచిలీపట్నంలో అయ్యగారి రామ్మూర్తి పంతులు 76 ఏళ్ల క్రితం నిర్మించిన సైంటిఫిక్ కంపెనీ బెల్ కంపెనీగా రూపాంతరం చెందిందని, రామ్మూర్తి పంతులు ముందు చూపు అందరికీ ఆదర్శమని బెల్ కంపెనీ జీఎం జితేందర్‌సింగ్ అన్నారు. బెల్ కంపెనీ 76వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శనివారం కంపెనీ ఆవరణలోని రామ్మూర్తి పంతులు విగ్రహానికి ఆయన నివాళులర్పించారు. రాంజీ హైస్కూల్‌లో బీరువాలు, షార్కీ హైస్కూల్ హాస్టల్‌కు నిత్యావసర వస్తువులు, బియ్యం, గ్రైండర్, ప్లాస్టిక్ కుర్చీలు అందజేశారు. పేదలకు అన్నదానం చేశారు. ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రగడ కోటయ్య జయంతి

ఘంటసాల, జూలై 26(ఆంధ్రజ్యోతి): చేనేత పితామహుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు ప్రగడ కోటయ్య జయంతిని శనివారం ఘంటసాలలో ఘనంగా జరుపుకొన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ప్రగడ కోటయ్య విగ్రహానికి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంది జగదీష్, పంచాయతీ కార్యదర్శి జయలక్ష్మి నివాళులర్పించారు. చేనేతల అభ్యున్నతికి ప్రగడ కోటయ్య విశేష కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో చేనేత నాయకులు ఉడతా చిత్తరంజన్ సాయి, అక్కల లీలాపసాద్, నందం పవన్ కుమార్, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్నిబాధితుడికు చేయూత

మచిలీపట్నం టౌన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): బందరు మండలం నెలకుర్రు గ్రామంలో శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితుడు మామిడి శ్రీనివాస్‌కు శనివారం అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ పల్లపోతు సుబ్రహ్మణ్యేశ్వరరావు, చంద్రకుమారి దంపతులు నిత్యావసర వస్తువులు, బియ్యం, దుస్తులు అందజేశారు. న్యాయవాది లంకిశెట్టి బాలాజీ రూ.2వేలు అందజేశారు. రవికుమార్, మల్లంపల్లి వీరవెంకట రామాంజనేయులు, బొమ్మసాని నరేష్, పిచ్చేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకులమన్నాడులో ఫీవర్ సర్వే

గూడూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆకులమన్నాడు సర్పంచ్ మహమ్మద్ రఫీ అన్నారు. శనివారం పంచాయతీ పరిధిలోని ఆకులమన్నాడుపాలెంలో ముందస్తు చర్యల్లో భాగంగా ఇంటింటికీ ఫీవర్ సర్వే నిర్వహించారు. ఉపసర్పంచ్ బాకీ నాని, మురళి, ఏఎన్ఎం మూర్తారాణి, సీహెచ్‌వో డాలీ సుకన్య, హెల్త్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం

● సుపరిపాలన కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానిక సమ ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. శనివారం జలాల్‌పేటలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని పాల్గొన్నారు. కొత్తపూడి గ్రామంలో తలారి సోమశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పరింకాయల శివాజీ, కేపీ రామస్వామి పాల్గొన్నారు.



జలాల్‌పేటలో వృద్ధురాలికి కరపత్రం అందిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, పెడన 8వ వార్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నాం

పెడన: గత వైసీపీ ప్రభుత్వం చిన్నాభిన్నం చేసిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను కూటమి ప్రభుత్వం గాడిలో పెడుతోందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. శనివారం పట్టణంలోని 8వ వార్డులో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య, వహాబ్‌ఖాన్, అబ్దుల్ ఖయూం(హన్ను), పూలబాబు, చందన నారాయణరావు, కమ్మగంటి బాబు, యక్కల బసవ, వీణం శ్రీనివాస్ పాల్గొన్నారు.

రామానగరంలో..

చల్లపల్లి: రామానగరం 82వ బూత్‌లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని టీడీపీ సీనియర్ నాయకుడు బొబ్బా గోవర్ధన్ పార్టీ నేతలతో కలిసి నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరరావు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఎంపీటీసీలు మాలెంపాటి శ్రీనివాసరావు, పైడిపాముల స్వప్న, షేక్ నబీషోరి, క్లస్టర్ ఇన్‌చార్జిలు మోర్ల శివ, మల్లంపల్లి శివరామకృష్ణ పాల్గొన్నారు.

సింహాద్రి కాలనీలో..

అవనిగడ్డ: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సింహాద్రి కాలనీలో దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలు అందించారు. కర్రా సుధాకర్, పరుచూరి దుర్గాప్రసాద్, బండే రాఘవ, మండలి రామ్మోహనరావు, బచ్చు హనుమాన్, మెరుగు సోమిరెడ్డి పాల్గొన్నారు. కొత్త ఎడ్లంక సమీపంలోని వీవర్స్ కాలనీలో పార్టీ మం డల అధ్యక్షుడు యాసం చిట్టిబాబు తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు.

కప్తానుపాలెంలో..

మోపిదేవి: పెదప్రోలు పంచాయతీ శివారు కప్తానుపాలెంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు నడకుదుటి జనార్దనరావు, పార్టీ నాయకులు బొబ్బా గోవర్ధన్ పాల్గొన్నారు.

పోటుమీద గ్రామంలో..

కోడూరు: పోటుమీద గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు నిర్వహించారు. ఉప్పాల పోతురాజు, పుప్పాల కోటేశ్వరరావు, కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, పిల్లి మల్లికార్జునరావు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

మచిలీపట్నం టౌన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): పార్లమెంటు పరిధిలో వివిధ ఆస్పత్రుల్లో శస్త్రచికిత్స చేయించుకున్న నలుగురికి రూ.3లక్షల విలువైన సీఎం సహాయ నిధి చెక్కులను శనివారం ఎంపీ వల్లభనేని బాలశౌరి అందజేశారు. నాయకులు మాదివాడ రాము, గడ్డం రాజు, గల్లా తిమోతి పాల్గొన్నారు. కానూరు గ్రామ సచివాలయంలో ముగ్గురికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ శనివారం అందజేశారు. జనసేన ఇన్‌చార్జి దివి మహేష్, పీతారాము, బొమ్మిడి ఏడుకొండలు పాల్గొన్నారు.



చెక్కులు అందిస్తున్న ఎంపీ బాలశౌరి

గంజాయి అమ్మినా, కొన్నా చర్యలు

● ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.గంగాధర్

మచిలీపట్నం టౌన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): గంజాయి అమ్మినా, కొన్నా చర్యలు తప్పవని ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.గంగాధర్ హెచ్చరించారు. బలరామునిపేటలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అసిస్టెంట్ సూపరింటెండెంట్ సి.భార్గవ, ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు, ఎస్సై రవి పాల్గొన్నారు.

గుండేరు వల్ల పొలాలు
ముంపు బారిన పడకుండా చూస్తాం

● మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గుండేరు డ్రెయిన్ వలన పంట పొలాలు ముంపునకు గురికాకుండా చూస్తామని రైతులకు మంత్రి కొల్లు రవీంద్ర భరోసా ఇచ్చారు. శనివారం చిన్నాపురంలో గుండేరు డ్రెయిన్‌లో గుర్రపుడెక్క తొలగించే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. మంత్రి కొల్లు రవీంద్రకు గ్రామ రైతులు తమ సమస్యలు విన్నవించారు. కూలిపోయిన పాత వంతెనను పూర్తిగా తొలగించాలని, కొత్త వంతెన కింద క్రాస్ బండలు అలాగే ఉన్నాయని, డ్రెయిన్‌లో గుర్రపుడెక్క అడ్డుపడి వరద పంట పొలాలను ముంచుతోందని తెలిపారు. పాతవంతెన తొలగించేందుకు రూ.25 లక్షలు మంజూరు చేశామని, ఆ నిధులతో పాత వంతెన తొలగించేందుకు భారీ క్రేన్లు తీసుకొచ్చామని మంత్రి తెలిపారు. ప్రధాన వంతెన కింద ఉన్న క్రాస్ బండలు తొలగించేందుకు అంచనాలు రూపొందించాలని ఇంజనీర్లను మంత్రి ఆదేశించారు. రూ. 10 లక్షలు ఖర్చు అవుతుందని ఇంజనీర్లు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ కుంచే నాని, జలవనరుల శాఖ కేసీ డివిజన్ ఈఈ రవికుమార్, డీఈ అపర్ణ, డ్రెయినేజీ డీఈ జె.వి.నాయక్, ఏఈలు నజ్మారాణి, హరీష్, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, సర్పంచ్ కాగిత గోపాలరావు, నీటి సంఘం అధ్యక్షుడు కేసన రమేష్, పీఏసీఎస్ చైర్మన్ పినిశెట్టి నిరంజనరావు పాల్గొన్నారు.



ఇనకుదురుపేటలో అమరవీరుడు షేక్ హాజీ హుస్సేన్ వీధిని ప్రారంభిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నంలో ర్యాలీలో పాల్గొన్న ముడా చైర్మన్ మట్టా ప్రసాద్



మాజీ సైనికుడు, ఆర్టీసీ డీఎం పెద్దిరాజును సత్కరిస్తున్న మోటమర్రి బాబాప్రసాద్



కప్తానుపాలెంలో కొవ్వొత్తులు వెలిగించి అమరవీరులకు నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

అమరవీరుల త్యాగం చిరస్మరణీయం

మచిలీపట్నం టౌన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ కోసం వీరమరణం పొందిన అమరవీరుల త్యాగం చిరస్మరణీయమని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా శనివారం ఇనకుదురుపేటలోని ఓ రోడ్డుకు అమరవీరుడు హాజీ హుస్సేన్(ఇండియన్ ఆర్మీ వారి వీధి) పేరు పెట్టారు.

కార్గిల్ వీరుడు పెద్దిరాజుకు సత్కారం

కార్గిల్ యుద్ధంలో సేవలందించిన ఆర్టీసీ డీఎం పెద్దిరాజును మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సత్కరించారు. మోటమర్రి బాబాప్రసాద్, పి.శ్రీరాం, జి.కిశోర్‌కుమార్, హసీంబేగ్, బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. పెద్దిరాజును బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ, పీవీ ఫణికుమార్, మద్దాల సువర్ణరాజు తదితరులు సన్మానించారు. కార్గిల్ విజయ్‌దివస్ సందర్భంగా నగరంలో నిర్వహించిన ర్యాలీలో ముడా చైర్మన్ మట్టా ప్రసాద్ పాల్గొన్నారు. ఆర్కే కళాశాలలో నిర్వహించిన సమావేశంలో బీజేపీ నూతన అధ్యక్షుడు తాతినేని శివరాం, ముడా చైర్మన్ మట్టా ప్రసాద్, పంతం గజేంద్రరావు, మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు గాడెల్లి వసంతరావు, ఆర్కే కళాశాల ప్రిన్సిపాల్ శివరామకృష్ణ పాల్గొన్నారు. పద్మావతి మహిళా కళాశాలలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, మేరా యువభారత్ మై భారత్ ఆధ్వర్యంలో విజయ కార్గిల్ దివస్ నిర్వహించారు. మాజీ ఆర్మీ మేజర్ సుబ్రహ్మణ్యం, అడిషనల్ ఎస్పీ సత్యనారాయణ, డీఎస్పీ రాజా పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళి

మోపిదేవి: పెదప్రోలు పంచాయతీ శివారు కప్తానుపాలెంలో విజయ కార్గిల్ దివస్ కార్యక్రమాన్ని టీడీపీ నేతలు నిర్వహించారు. యుద్ధంలో వీర మరణం పొందిన అమరవీరులకు నాయకులు కొవ్వొత్తుల వెలిగించి ఘనంగా నివాళులర్పించారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో సీఐడీ ఎస్పీ ప్రసాద్

మోపిదేవి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని సీఐడీ ఎస్పీ దావర కొండ ప్రసాద్, కుటుంబసమేతంగా శనివారం దర్శించుకున్నారు. నాగపుట్ట వద్ద పాలు పోసి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారికి స్వామి చిత్రపటం, ప్రసాదాలను ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ అందజేశారు.



నాగపుట్టలో పాలుపోసి పూజలు చేస్తున్న సీఐడీ ఎస్పీ ప్రసాద్ కుటుంబసభ్యులు

ఆలయ అభివృద్ధికి రూ.50 వేలు విరాళం

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధికి ఘంటసాల మండలం చిట్టూర్పు గ్రామానికి చెందిన ఇమ్మిడి శ్రీనివాసరావు-స్వరూపరాణి దంపతులు, వారి కుమారులు పవన్‌కుమార్, భానుప్రకాష్ పేర్ల పైన రూ.50 వేలు విరాళమిచ్చారు. శనివారం ఆలయ ఈవో డి.శ్రీరామవరప్రసాదరావును కలిసి చెక్కును అందజేశారు.

శ్మశానవాటికు సిమెంటు రోడ్డు వేయాలి

పెడన, జూలై 26(ఆంధ్రజ్యోతి): తామరచెరువు పక్కనుంచి ఆర్యవైశ్య శ్మశానవాటికకు సిమెంటు రోడ్డు వేయాలని, పాత కూరగాయల మార్కెట్ సెంటర్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహం ఉన్న ప్రదేశాన్ని అభివృద్ధి చేయాలని ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు కొల్లూరి చిన్నా కోరారు. ఈమేరకు మునిసిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారికి శనివారం ఆయన వినతిపత్రం ఇచ్చారు. సంఘ నాయకులు ఆత్మకూరి సురేష్, కేటీ మురళీకృష్ణ, చిలకల శ్రీనివాసగుప్తా, చిట్టూరి పశుపతినాథ్ పాల్గొన్నారు.

కేవీకేలో డెమో యూనిట్లు అభివృద్ధి చేయండి

ఘంటసాల, జూలై 26(ఆంధ్రజ్యోతి): కృషి విజ్ఞాన కేంద్రంలో డెమో యూనిట్లను ఇంకా అభివృద్ధి చేయాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు డాక్టర్ జి.వి.శివన్నారాయణ అక్కడి శాస్త్రవేత్తలకు సూచించారు. శనివారం ఆయన కేవీకేను సందర్శించారు. సార్వా కార్యాచరణ ప్రణాళికపై శాస్త్రవేత్తలతో చర్చించారు. ఈ కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డి.సుధారాణి, శాస్త్రవేత్తలు రేవతి, వెంకటలక్ష్మి, మంజువాణి, కృష్ణవేణి, యశ్వంత్ కుమార్, నవీన్ పాల్గొన్నారు.



కేవీకేలో శాస్త్రవేత్తలతో మాట్లాడుతున్న విస్తరణ సంచాలకుడు శివన్నారాయణ

పేదల ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

పెడన రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పేదల కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేసి ఆగస్టు 15న ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఎండీవో ఎ.అరుణకుమారి ఆదేశించారు. హౌసింగ్ ఏఈ వహిద, ఇంజనీరింగ్ అసిసెంట్లతో ఆమె శనివారం సమావేశం నిర్వహించారు. నిర్మాణంలో ఉన్న ఇళ్ల పనులను ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పరిశీలించాలని ఆదేశించారు.

చీరల పంపిణీ

చల్లపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తన కుమార్తె వేముల హిమవర్ష పుట్టినరోజు సందర్భంగా ఆమె చదువుకున్న పాఠశాల శ్రీవిజయా అకాడమీలో ఆయాలకు బీసీ నేత వేముల అర్జునరావు చీరలు పంపిణీ చేశారు. ఉపసర్పంచ్ ముమ్మనేని నాని చేతులమీదుగా ఈ కార్యక్రమం నిర్వహించారు. విశ్రాంత ఏఈ వేముల శేషగిరిరావు, వేముల హరికృష్ణ, వేముల నాగశ్రీనివాసరావు పాల్గొన్నారు.

సబ్ జైలుకు వనరులు సమకూరుస్తాం

● ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు

మచిలీపట్నం టౌన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): సబ్‌జైలుకు అవసరమైన వనరులు సమకూరుస్తామని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు తెలిపారు. శనివారం సబ్‌జైలు ప్రాంగణాన్ని టీడీపీ సీనియర్ నేత గొర్రెపాటి గోపీచంద్‌తో కలిసి ఆయన సందర్శించారు. జైలు వద్ద డ్రెయినేజీ సమస్యను పరిష్కరిస్తామన్నారు. డ్రెయినేజీ వల్ల ఇబ్బంది పడుతున్నామని 45వ డివిజన్ ప్రజలు ప్రజాదర్బార్‌లో మంత్రి కొల్లు రవీంద్రకు ఫిర్యాదు చేశారని గోపీచంద్ తెలిపారు. దీంతో బాగు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారని తెలిపారు. జైలు సూపరింటెండెంట్ పి.రమేష్, మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, పీవీ ఫణికుమార్ పాల్గొన్నారు.



సబ్ జైలు ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు

31న కృష్ణమ్మకు మహావస్త్ర సమర్పణ

నాగాయలంక, జూలై 26(ఆంధ్రజ్యోతి): కృష్ణమ్మకు ఈనెల 31వ తేదీన మధ్యాహ్నం మహావస్త్ర సమర్పణ కార్యక్రమం నిర్వహిస్తామని శ్రీరామపాదక్షేత్రం ఆలయ కమిటీచైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు తెలిపారు. 401 చీరలు సమర్పిస్తామన్నారు.